# శ్రీశ్రీ

## కమ్యూనిస్టు కాదు

భీమన్న సాహితీ నిధి

బోయి భీమన్న

**Sri Sri Communist Kaadu**

*- Dr. Boyi Bhimanna*

©All rights reserved

First Edition : January, 2004

Price : Rs. 60/-

Cover Page Design :

*Ravi Chandra Ponnada*

*Printed by :*

**Intensive Designs Media**
Kukatpally, Hyderabad - 72.
Ph : 040-23161289, Mobile : 98496 38108
E-mail : rcrakhil@yahoo.com

*Published by :*
**Bhimanna Sahithi Nidhi**
Irrum Manzil Colony,
Hyderabad.
E-mail : b_bhimanna@yahoo.com
URL : www.boyibhimanna.com

# శ్రీశ్రీ కమ్యూనిష్టు కాదు

శ్రీశ్రీ కమ్యూనిస్టు కాదు
కమ్యూనిస్టులూ మమూలు మనుషులే
వాళ్ళకూ వుంటై మమకారాలు !

వాళ్ళల్లో అధిక భాగం అవకాశవాదుల్లు
అధికార పదవీ లాలసులు
బూర్జువాలు, భోగ ప్రియులు !

వాళ్ళ నాయకులలో ఎక్కువమంది
అధికారం కోసం కమ్యూనిస్టులైన వాళ్ళే
ఈనాటి ప్రపంచ మానవుల్లో
సంస్కారం గల సంపన్నులే !

కమ్యూనిజంలో కూడా కోరికలు నెరవేరక
పుట్టినవే అరసం, విరసం, దిగంబర వాదం
ఈనాటి ఉగ్రవాదం, నగ్జలిజం కూడా !
హింసావాద మంతా అహింస చేత కాకనే !

# శ్రీశ్రీ రసధ్వని

ఏమని పాడెదనో ఈ వేళ
మానసవీణ మౌనముగా నిదురించిన వేళ ॥

జగమే మరచి, హృదయ విపంచి
గారడిగా వినువీధి చరించి
కలత నిదురలో కాంచిన కలలే
గాలి మేడలై కూలిన వేళ॥

వనసీమలలో హాయిగా ఆడే
రాచిలుకా నిను రాణిని చేసే
పసిడి తీగల పంజర మిదిగో
పలుక వేమని పిలిచే వేళా ॥

ఈ పాట నేను విన్నప్పుడు, అది ఎవరు వ్రాసిందో తెలియదు. సినిమా పాటలు వందలూ, వేలూ వున్నై. కొన్ని పాటల క్యాసెట్లు ప్రచారంలో ఉన్నై. పిల్లలు నచ్చిన క్యాసెట్లు కొని తెస్తూ వుంటారు. వినక తప్పదు కదా !

అలా వినే పాటల్లో నాకు కొన్ని పాటలు నచ్చుతూ వుంటై. అలా నచ్చిన పాటల్లో ఇదొకటి. ఈ పాట నాకు ఎంతగా నచ్చిందంటే దీనిని వ్రాసిన వారెవరో తెలుసుకోవడానికి ప్రయత్నం మొదలు పెట్టాను. ప్రయత్న ఫలితం నన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. శ్రీశ్రీ వ్రాసిన పాట ఇది.

శ్రీశ్రీ వ్రాసిందే మరొక పాట కూడా నన్ను బాగా కదిలించింది. ఆ పాట ఇది.

పాడవేల రాధికా
ప్రణయ సుధా గీతికా॥

ఈ వసంత యామినిలో
ఈ వెన్నెల వెలుగులలో
జీవితమే పులకించగ
నీ వీణను సవరించి ॥

గోపాలుడు నిను వలచి
నీ పాటను మది తలచి
ఏ మూలనొ పొంచి పొంచి
వినుచున్నాడని ఎంచి ॥

వేణుగానలోలుడు నీ
వీణా మృదు రవము విని
ప్రియ మారగ నిను చేరగ
దయచేసెడి శుభవేళా ॥

అది వసంత రాత్రి. అదొక ఉద్యానవనం. పూర్ణిమ వెన్నెల. ఒక చెట్టు కింద కూర్చుని వీణ మీటుతూ రాధ పాడుకొంటున్నది. ఎంత చక్కని వాతావరణం. ఎంత చక్కని సన్నివేశం. ఆ సమయంలో రాధ అలా తన్మయమై పాడుకుంటూ వుంటుంది.

తన్మయమై అంటే, ఎవరిలో ?
ఎవరేమిటి? తన ప్రియమైన కృష్ణుడు కాక మరింకెవరు ?

మామూలు మనుషుల్లోనే ఎవరైనా ఒక పని చేసినప్పుడు. ఆ పని తనకు ప్రియమైన వారికి ఇష్టమైన పని అయి వుండినప్పుడు, ఆ పనిని ఆ ప్రియమైన వారి మెప్పుకోరి తాను చేస్తున్నప్పుడు, ఆ మెప్పుకోసం ఆ పనిని ఇంకా బాగా చెయ్యడానికి ఆ వ్యక్తి ప్రయత్నిస్తాడు (ప్రయత్నిస్తుంది).

రాధ పాడుతున్నది. ఆ పాటను కృష్ణుడు వింటున్నాడనుకొన్నప్పుడు ఇంకా బాగా పాడుతుంది. వీణ సహకరించ నప్పుడు దానిని మరీ మరీ సవరిస్తూ వుంటుంది.

అంతటి రసవత్తర సన్నివేశాన్ని శ్రీశ్రీ ఊహించగలిగాడంటే రసధ్వనికి ఎంతటి ప్రాధాన్య మిచ్చాడో మనం ఊహించే కొలదీ ఆనందం కలుగుతుంది. అక్కడ తానూ ఒక ప్రేక్షకుడిగా, శ్రోతగా పరవశమై పోతున్నాడు కవి.

ఈ మొత్తం సన్నివేశాన్ని ఒక నాలుగు పంక్తులు పాటలో ఎంత శ్రావ్య సుందరంగా పాడుకోగలిగాడు శ్రీశ్రీ. మొత్తం రస స్వరూపాన్నే మన హృదయాల్లో స్రవింప చేశాడు. ఇంతటి ప్రతిభావంతుడు మామూలు భౌతిక వాది ఎలా అవుతాడు?

"గోపాలుడు నిను వలచి" అనే నాలుగు పంక్తులు చదివి నేను అలానే పరవశుణ్ణై పోయాను. అప్పుడనిపించింది నాకు శ్రీశ్రీ సామాన్య భౌతికవాది కాదనీ, "రసో వై సః" అనే ఆధ్యాత్మిక మహనీయుడని.

కృష్ణుడు ఆమె పాట వింటున్నాడు. ఏ మూలనో పొంచి పొంచి కాదు. ఏ నీడనో పొంచి పొంచి వింటున్నాడు. అతని శరీర ఛాయలో కలిసి పోయిన నీడలు. వెన్నెల వెలుగులు సృష్టిస్తున్న వసంత వన దేవతల నీడలు. ఎన్నో నీడలు, ప్రతి నీడా అతడే. ఎందరో అతడులు. ఆ ఒక్కడూ విశ్వరూపం ధరించి, తన చుట్టూ మూగి వింటున్నాడు. అందులో అసలు వా డెవరు ? అసలు కృష్ణుడు ఆ చెట్టు మీదే ఉన్నాడు. రాధే చెట్టై పోయింది. కృష్ణుడు వేణువు. వేణువు పురుష ధ్వని. తాను రాధ. వీణాధ్వని. వేణువు కంటే వీణ గొప్పదని అంగీకరించిన కృష్ణుడు వీణ కోసం వచ్చాడు. కొమ్మల్లో దాక్కున్నాడు. ఇక ప్రత్యక్షమవుతాడు. అదీ శ్రీశ్రీ ఊహించిన చిత్రం. శిల్పం. ప్రకృతి పురుష తత్వం.

వెంటనే శ్రీశ్రీ నిజస్వరూపాన్ని ప్రపంచానికి చూపించడం కోసం కలం పట్టాను. ఫలితం ఇది.

## అందం - ఆనందం

ఈ రెండు పాటలు విన్న తర్వాత, ఇవి శ్రీశ్రీ వ్రాసిన పాటలు అని తెలుసుకొన్న తర్వాత శ్రీశ్రీ ఇంత గొప్పకవా అనిపించింది.

ఈ పాటలు వ్రాసిన శ్రీశ్రీ మామూలు కవే కాదు. మహాకవి. ముఖ్యంగా

గోపాలుడు నిను వలచి అనే నాలుగు పంక్తులు కాళిదాసు శాకుంతలంతో పోటీ పడగల స్థాయిలో ఉన్నై. ఇంతటి మహాకవి మార్క్సిస్టు సిద్ధాంత పంజరంలో ఎలా యిరుక్కున్నాడో, అందుకు ఎంత దుఃఖపడ్డాడో ఏమని పాడెదనో అన్న పాటలో కన్నీటితో వివరిస్తున్నాడు.

ఎంతటి కవి అయినా స్వేచ్ఛా విహార విశ్వం నుంచి దళితుడైపోయి ఏదో ఒక సిద్ధాంత పంజరంలో యిరుక్కుపోవడం కంటే బాధాకరమైన విషయ ముండదు. ఎందుకు జరిగిందో తీక్షణంగా పరిశీలించవలసి ఉన్నది. అందుకే నా కిదొక కవితావస్తు వయింది. నన్ను ఒక పరిశోధక పథంలో నడిపించింది.

మొదట్లో నాకు శ్రీశ్రీ పట్ల కవిగా అనుకూలత లేదు. ఆయన వ్రాసిన కొన్ని కొన్ని కవితలు చూచిన తర్వాత ఆయనలో కవిత్వం పాలు తక్కువ అనిపించేది.

కవితా లక్షణం : కవి అనేవాడు 'సృష్టిని సరిదిద్దగల శిల్పి'. సృష్టిలో ఉన్న లోపాలను సరిదిద్ది, అసలు సృష్టినే మెరుగుపరచి దాని ఆంతర్యాన్ని ప్రజలకు వివరించి చూపగల ఊహా కళాకారుడు.

కవి అంటే చెడును మంచిగా చూపవలసిన వాడు. మంచిని చెడుగా చూపే వాడు కవి కాడు. అందుకు తగిన తన స్వంత సిద్ధాంతాలేవో ప్రతి కవికీ ఉంటై. అందుకు విరుద్ధంగా ఒక రాజకీయ సిద్ధాంతానికి కట్టుబడి, ఒక వర్గానికి చేరిపోయి, పార్టీకి అతీతంగా వుండవలసినవాడు తానొక పార్టీకి చెంది మరొక పార్టీపై యుద్ధం ప్రకటించడం కవి లక్షణం కానే కాదు కదా !

గొంగళి పురుగులోని సీతాకోకచిలుకను జనానికి చూపి అలరించవలసిన కవి, సీతాకోక చిలుకలోని గొంగళి పురుగును చూపి అసహ్యం కలిగించడం కవి చేయవలసిన శిల్పం కాదు కదా !

ఎడారిలో కాళ్లు తెగి పడి ఉన్న ఒంటెను మేఘశకలాల మధ్య గిలగిల లాడుతున్న చంద్రుడితో పోల్చవచ్చు. అట్టి చంద్రుణ్ణి కాళ్ళు తెగి పడి ఉన్న ఒంటెతో పోల్చడం కవిత్వ లక్షణం కానే కాదు. శ్రీశ్రీ ఒక కవితలో అట్టి వర్ణన చూచినప్పుడు శ్రీశ్రీ కవే కాదు అనిపించింది నాకు. అప్పుడు కొన్ని విమర్శలు చేశాను.

కుక్కపిల్ల అగ్గిపుల్ల
సబ్బు బిళ్ల
కాదేది కవిత కనర్హం

అన్నాడు శ్రీశ్రీ. భావం కొత్తదేమీ కాదు. సృష్టిలోని ఏ వస్తువు నయినా కవితా వస్తువుగా స్వీకరించ వచ్చునని పూర్వం ఎందరో చెప్పారు. అలా జరుగుతూ వచ్చింది కూడా. అయితే కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ అని ప్రత్యేకంగా చెప్పడంలో శ్రీశ్రీని దేవుడుగా భావించే కమ్యూనిస్టు యువకులు అలాంటి అల్ప వస్తువులనే కవితా వస్తువులుగా గ్రహించి కవితలు వ్రాయడం మొదలు పెట్టారు.

నిజానికి ఈ కవిత ద్వారా కవిత్వానికి ఎంత అపకారం జరిగిందో, ఎంతమంది కవులు కావలసిన యువకులు అకవులై పోయారో చెప్పడం కష్టం.

గొప్పవాడనుకున్న వ్యక్తిని చాల విషయాలలో అతని అనుచరులు, ప్రజలు అనుసరిస్తారు. ఆ గొప్పవాడు గడ్డిలో విటమిన్లు ఉన్నాయని అంటే గడ్డినే తినడం ఎంత వరకు సబబు ?

పెండ్లికి పనికి రాని ఆడపిల్ల అంటూ వుండదు. అయితే పూర్వంగాని, యిప్పుడు గాని, పెళ్ళి కాని వారు ఎంతమంది లేరు ? ఎందుకని ?

సబ్బుబిళ్ళ కంటె ఆ బిళ్ళను ఉపయోగించే లావణ్యవతి కవితా వస్తువుగా ఎక్కువ అర్హురాలు కదా !

అందువల్ల అల్ప వస్తువులకు ప్రాధాన్యమిచ్చి కమ్యూనిజం పేరుతో ప్రతిభను అల్పం చేశాడు శ్రీశ్రీ. ఔన్నత్యాన్ని దీనం చేశాడు. అదీ నా బాధ.

అదే సమయంలో బాపురెడ్డి గారి 'రాకెట్టు రాయబారం' కావ్య సంపుటికి పీఠిక వ్రాసినపుడు, దానిలో శ్రీశ్రీ పైన విమర్శ వుంది. శ్రీశ్రీ 'మహాప్రస్థానానికి' చలం వ్రాసిన ఉపోద్ఘాతంలా ఉన్న దన్నారు విమర్శకులు నా పీఠికను చదివి.

ఒక పార్టీకి చెందడంతో పాటు, రచనలలో కవితా వ్యతిరేక లక్షణాలు కనిపించడం వల్ల శ్రీశ్రీ పట్ల నా మనస్సు అనుకూలంగా ఉండేది కాదు. ఆయన పోయిన తర్వాత క్యాసెట్టులో ఆయన పాటలు విన్న తర్వాత ఆయన ఎంతటి మహాకవో తెలిసి వచ్చింది.

# శ్రీశ్రీ పాత్ర

"శ్రీశ్రీ పుట్టి సాహిత్యాన్ని, ఘంటసాల పుట్టి సంగీతాన్ని నాశనం చేశారు" అన్నాను నేను పూర్వ మెపుడో.

ఆ రెండు కళలతోను చారిత్రక పురుష లయిన శ్రీశ్రీని, ఘంటసాలను విమర్శించా ననుకొన్నప్పుడు నన్ను నిందించారు కూడా వారి మిత్రులు.

నన్నయ "మా డిపార్టుమెంటు" (ట్రాన్స్‌లేషన్) వాడని – వ్యాస భారతాన్ని తెలుగు చేశాడే తప్ప స్వంతంగా ఏమీ రాయలేదని  ఆ కాలంలో నేనన్నప్పుడు మహాపండితులు చాలా మంది నా మీద విరుచుకు పడ్డారు.

మనకేమి తక్కువ ? నదులు లేవా ? సముద్రాలు లేవా ? సరస్సులు లేవా ? ఉద్యానవనాలు, అడవులు లేవా ? కొండలు, లోయలు లేవా ? అందమైన అమ్మాయిలు, బలమైన అబ్బాయిలు లేరా ? ఉజ్జ్వలమైన గీత లేదా ?

బెంగాలీ నవలలను ట్రాన్స్‌లేషన్ చేసుకొంటున్నాం. అలాంటి నవల ఒకటైనా మనం రాయగలిగామా ? ఢిల్లీలో హిందీ వాళ్ళకు చదివి వినిపించి, ఓహో అనిపించగల రచన మన కొకటైనా ఉన్నదా ? నోబుల్ అవార్డు బెంగాలీకే ఎందుకు వచ్చింది? బెంగాలీ కంటె మనకేమి తక్కువ ?

ఇలా నేను విమర్శించినపుడు నా మిత్రులకు సైతం కోపాలు వచ్చాయే తప్ప ఆత్మ విమర్శ రాలేదు. ఉపజ్ఞ గల రచనలు రాలేదు. ఎక్కడి గొంగళి అక్కడే పడివుంది.

మానవ జీవితమే రాజకీయం. రాజకీయం కానిది ఏదీ లేదు. ఆ విధంగా సాహిత్యరంగమూ రాజకీయమే. అయితే ఆధునిక సాహిత్యం ప్రత్యేకత ఏమిటంటే అది రాజకీయ పార్టీలుగా విడిపోయింది. పెద్దలది కన్సర్వేటివ్ పార్టీ అయితే, యువకులది కమ్యూనిస్టు పార్టీ అయ్యింది.

వ్యాస వాల్మీకులు సంస్కృతంలో రాసిన వాటినే రకరకాలుగా తెలుగులో వ్రాసి గొప్ప కవుల మనిపించుకుని సన్మానాలు పొందసాగారు పెద్దలు. అంతకు ముందు తెలిసిన కథలు కనుక సామాన్య ప్రజలు వాటినే ఆదరించసాగారు. ఆర్ష

సాహిత్యం పురాతన రత్న మాణిక్యాల లాంటిదన్నాడు ఒక కవి. అదలాగే ఏ మార్పు లేకుండా గిడసబారి పోయింది.

## సాహిత్యంలో పార్టీలు

ఇక ఆధునిక సాహిత్యాని కొస్తే సోషలిస్టు పార్టీలు, కమ్యూనిస్టు పార్టీలు, రైతు పార్టీలు, కార్మిక పార్టీలు, వివిధ వృత్తి సంఘాల అనేకానేక పార్టీలు సాహిత్యంలోనూ తయారయ్యాయి.

ఈ పార్టీలలో చిట్టచివరి వారినే నూలువారు – తోలువారు అన్నాడు జాషువా. అయితే జాషువా మహాకవి. ఏ పార్టీకి చెందిన వాడు కాదు కదా ! తన సమకాలీన, సమ సామాజిక కష్టసుఖాలను వస్తువులుగా తీసుకొని జీవిత ఔన్నత్యం కోసం రస కవిత లల్లినవాడు. కష్టాలను నిరసించాడు. సుఖాలను వికసింప చేశాడు.

ఒక పెద్ద దేశంలో కమ్యూనిస్టు పార్టీ అధికారం చలాయిస్తూ ఉండడం వల్ల దానికి ప్రపంచంలోని యువకులంతా నీరాజనం పట్టడం జరిగింది. ప్రపంచ కార్మికులారా ఏకం కండి అనే నినాదం ప్రతిధ్వనించింది. అదో ఉద్యమ రూపం దాల్చింది. ఆ ఉద్యమానికి సాహిత్య పరంగా శ్రీశ్రీ నాయకుడైనాడు.

శ్రీశ్రీ రంగంలో ప్రవేశించే నాటికి తెలుగు సాహిత్యంలో భావ కవిత్వ యుగం వసంత పూర్ణిమలా మూడు పువ్వులు ఆరుకాయలుగా ఉంది. అయితే దానికి ప్రోత్సాహకాలు విదేశీయమైనట్టివి. కీట్స్, షెల్లీ, వర్డ్స్‌వర్త్ మొదలైన పేర్లు వినిపించసాగాయి. అర్థానికి కాక, భావానికి ప్రాధాన్యం యివ్వసాగింది. భావాలను విడమరిచి చెప్పవలసిన భాష తలక్రిందులై స్పష్టమైన అర్థాన్ని భావమయం చేయసాగింది. అర్థం, భావం స్థానాలు మార్చుకొన్నాయి. అది వాస్తవం కావలసి వుంది. అయితే వాస్తవం అధివాస్తవం అయి కూర్చుంది.

## గిడసబారిన భావ కవిత్వం

అట్టి అయోమయ స్థితిలో భావకవిత్వం కన్నీటి కెరటాల వెన్నెలలో ఉక్కిరి బిక్కిరై ఉండగా, కమ్యూనిస్టు భావాలు ఉప్పెనలా విరుచుకు పడ్డాయి. భావ కవిత్వ ధోరణి పనిలేని మంగలి పనిగా భావించిన యువకులు కమ్యూనిస్టు భావాలలో

వాస్తవాన్ని పసిగట్టగలిగారు. దాని వైపునకు ఆకర్షితులయ్యారు. అదే రకం ఊగిసలాటలో ఉన్న శ్రీశ్రీ అట్టివారికి నాయకుడై కూర్చున్నాడు. “కలత నిదురలో కాంచిన కలలే గాలిమేడలై కూలిన వేళ” శ్రీశ్రీ భావకవిత్వం వదిలి కమ్యూనిస్టు రాజకీయాలలో పడ్డాడు.

మహా ప్రస్థానంలోని మరో ప్రపంచ గేయం వ్రాసిన శ్రీశ్రీ దాన్ని కృష్ణశాస్త్రి గారిచే దిద్దించు కొన్న కాలం అది. అయితే “సలసల కాగే చమురా ? కాదది, ఉష్ణరక్త కాసారం” అన్న శ్రీశ్రీ ధోరణికి, “మధురం మధురం మధురం మధురం” అన్న కృష్ణశాస్త్రి దిద్దుబాటు అతకలేదు.

అసలు గేయమూ, దిద్దిన గేయమూ రెండూ పత్రికలలో ప్రకటించ బడ్డాయి. శాస్త్రిగారి దిద్దుబాటు నాకు నచ్చలేదు. కుర్రవాళ్ళకెలా నచ్చుతుంది? అందువల్ల దిద్దుబాట్లని దిద్దేసి అసలు గేయాన్నే ప్రచారంలోకి తీసుకున్నారు. ఈ గేయం నాకు కంఠస్థం వచ్చు. ఆ కాలంలో ప్రతి సభలోనూ ఈ గేయాన్నే పాడేవాడ్ని.

అది కాంగ్రెస్సు నుంచి కాంగ్రెస్సు సోషలిస్టులు కొందరు కమ్యూనిస్టుగా విడిపోక ముందటి కాలం. నేనూ అప్పటికి సోషలిస్టునే. మహీధర రామ్మోహనరావు, వారి కుటుంబం, వారి అవంతీ ప్రెస్ అందించిన కమ్యూనిస్టు నినాదాలు, సాహిత్యం అప్పటికే బాగా చదివి వున్నవాణ్ణి. మరో ప్రపంచం గేయాన్ని బ్రహ్మసమాజం ట్యూన్ కట్టి పాడుతున్న రోజులలో, దానిని పంచ కల్యాణి గుర్రం దౌడులో (స్పీడ్‌లో) నేను పాడి ప్రచారం చేసిన రోజులవి. ఆ గేయంలో ఇప్పుడు కనిపిస్తున్న అనౌచిత్యాలు అప్పుడే కనిపించినా వాటిని లెక్క చేసే వయస్సు కాదు నాది అప్పుడు.

శ్రీశ్రీ రచనల్లో అప్పుడూ ఇప్పుడూ కూడా నాకు కనిపించిన, కనిపిస్తున్న అనౌచిత్యాలే శ్రీశ్రీ కమ్యూనిస్టు కవి కాదు అనడానికి నాకు లభించిన రుజువులలో కొన్ని.

శ్రీశ్రీని గురించి సమగ్రంగా తెలుసుకోవడం ఆ విధంగా ఏర్పడింది. కొన్ని కొన్ని పాటలలో కవితా మేరువు శిఖరాగ్రంపై తాండవిస్తూ కనిపిస్తున్నాడిపుడు నాకు ఆనందబాష్పాల ద్వారా.

వాస్తవం గానే అంత ఎత్తులో ఉండవలసినవాడు స్వయంగా పంజరంలో దూరి దుఃఖపడవలసిన అవసరం ఏం వచ్చిందట ?

## శిశిరస్థితి

ఒక విశిష్టమైన కాలంలో శ్రీశ్రీ కవిగా వెలుగులోకి వచ్చాడు. అది శిశిర ఋతువు. అన్ని విలువలు రాలిపోయి, మోడువోయిన స్థితి అది. ఒక్క రాజకీయాలకు, జాతీయోద్యమానికి తప్ప మరి దేనికీ ప్రాధాన్యంలేని కాలం అది. కాంగ్రెస్సు, జాతీయోద్యమం, ప్రపంచ యుద్ధ వాతావరణం, కాంగ్రెస్సు లోని సోషలిష్టు యువకుల కార్యక్రమాలు తప్ప మరొక దానిపై దృష్టి పారని కాలమది. అట్టి కాలంలో దేనికీ విలువ లేనట్టే కవిత్వానికి కూడా విలువ లేదు. ఉద్యమాలను నడిపే వేగవంతమైన కాలంలో పాటలు వ్రాసేవాళ్ళు, పాడేవాళ్ళు, రచనా వ్యాసంగం ఆ విధంగా సాగేది. అప్పుడు వినబడింది శ్రీశ్రీ పేరు.

కాంగ్రెస్సు దృష్టి కేవలం జాతీయోద్యమం మీద, ప్రజల దృష్టి కాంగ్రెస్సు మీద. నాయకులు, యువకులు, ప్రజలు కూడా తీక్షణంగా చూస్తున్నది స్వరాజ్యం కోసం. దేశ స్వాతంత్ర్యం కోసం, వ్యక్తికి కాక వ్యక్తి చేసే పనికి ప్రాధాన్యం ఇవ్వవలసిన కాలం అది. శ్రీశ్రీ కవి అయితే అలాంటి ఎంతో మంది కవులు ఉద్యమగీతాలను, ఉద్రేక గీతాలను వ్రాసి పారేస్తున్నారు.

## వ్యక్తికి కాదు, వ్యక్తి చేసే పనికి

ప్రతి వ్యక్తి స్వభావ రీత్యా ప్రత్యేకత కోసం ప్రయత్నం చేస్తున్నాడు. ఉద్యమంలో త్యాగాలు చెయ్యడం, దెబ్బలు తినడం, జైళ్ళకు వెళ్ళడం వంటి కార్యక్రమాలలో ఒకరిని మించి ఒకరు ముందుకు దూకుతుంటే, ఉద్యమ గీతాలు వ్రాయడంలో కవులు ఉవ్వెత్తున పొంగుతున్నారు. జాతీయ గీతాలు ఒకదాన్ని మించి ఒకటి అదునుకు తగ్గ పదునుతో పుట్టుకొస్తున్నాయి.

రాయప్రోలు, విశ్వనాథ వంటి ఎందరో వ్రాస్తున్న ఉద్యమ గీతాలలో చాలామంది ఇతర రచయితల రచనలు పోటీపడలేక పోయినై. తరచు ప్రతిభ గలవాళ్ళు గుర్తింపు ఎలా వస్తుందా అన్న ఆలోచనలో పడ్డ కాలమది.

శ్రీశ్రీ మహాప్రస్థానం వ్రాశాడు. బాగానే ఉంది. అయితే కాంగ్రెస్సు లాంటి జాతీయ సంస్థల దృష్టి కేంద్రీకరణ స్వాతంత్ర్యోద్యమం పైనే కదా ? ఏనాడూ అట్టి జాతీయ సంస్థలు కళాసాహిత్యాల కార్యసాధన శక్తిని గుర్తించినట్టివి కావు.

కాంగ్రెసు నుంచి తీవ్రవాదులైన సోషలిష్టులు కమ్యూనిస్టులుగా విడిపోవడం జరిగింది. కమ్యూనిస్టులకు ప్రత్యేకంగా గుర్తింపు కావలసి వచ్చింది. ఉద్యమం సాగాలి. అందుకు వివిధ రకాల సాధనాలు కావాలి.

అందులో ముఖ్యంగా కవులు కావాలి. ఉద్యమ గేయాలు కావాలి. పాడుతూ జెండాలు పట్టుకుని ముందుకు సాగేవాళ్ళు కావాలి. ముఖ్యంగా ఒక బలమైన కవి కావలసి వచ్చాడు. అప్పుడు వాళ్ళ కంటికి శ్రీశ్రీ కనిపించాడు.

## కమ్యూనిస్టు పార్టీ

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో రష్యాతో బ్రిటన్, అమెరికాలు చేరి ఆ యుద్ధాన్ని పీపుల్స్‌వార్ (ప్రజల యుద్ధం) అని పిలవడం మొదలైనపుడు కాంగ్రెస్సు నుంచి, అంతవరకు కాంగ్రెస్సులోనే ఉండి కాంగ్రెస్‌సోషలిస్టులుగా వ్యవహరించబడుతున్న యువకులలో కొందరు విడిపోయి కమ్యూనిస్టులైనారు. అంటే కాంగ్రెస్సుసోషలిస్టులలో కొందరు పూర్తిగా విడిపోయి కమ్యూనిస్టులైనా రన్నమాట.

వాళ్ళందరూ పూర్తిగా రష్యా అనుచరులు. బ్రిటన్ రష్యాతో చేరింది. కనుక తాము కూడా బ్రిటిష్ అనుచరులైనారు. అంతవరకు శత్రువులుగా పరిగణించబడుతూ వచ్చిన బ్రిటిష్ వాళ్ళు అప్పటి నుంచి స్నేహితులుగా పరిణమించారన్నమాట.

అప్పటి నుంచీ భారత కమ్యూనిస్టు పార్టీకి రష్యాయే లోకమయింది. రష్యా స్నేహితులు తమకు స్నేహితులు. రష్యా శత్రువులు తమకు శత్రువులు.

కాగా దేశం నుంచి వెళ్ళిపోవలసిందిగా క్విట్ ఇండియా ఉద్యమాన్ని కొనసాగిస్తున్న భారతీయ కాంగ్రెస్ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకం కనుక కమ్యూనిస్టులకు కాంగ్రెస్ శత్రువయ్యింది.

యుద్ధంలో భారతదేశాన్ని అనవసరంగా దింపారు అని కాంగ్రెస్ వారు విచారపడితే, ఇది పీపుల్స్‌వార్ అంటూ కమ్యూనిస్టులు కాంగ్రెస్ వ్యతిరేక ప్రచారం

ప్రారంభించారు. యుద్ధం మూలంగా శత్రువు అయిన కాంగ్రెస్ వారిని, ఇంకా కాంగ్రెసులో మిగిలి పోయిన కాంగ్రెస్‌సోషలిస్టులను వ్యతిరేకిస్తూ కొన్ని క్లిష్ట సందర్భాలలో వారి నాయకులను బ్రిటిష్ ప్రభుత్వానికి పట్టి ఇవ్వడం కూడా జరిగింది.

కాంగ్రెస్‌లో ఉండిపోయిన నాయకులలో జయప్రకాష్ నారాయణగారు ముఖ్యులు కదా. ఆయనను బ్రిటిష్ గవర్నమెంటుకు పట్టి యిచ్చిన వాళ్ళు కమ్యూనిస్టులే అనే ప్రచారం ఆ రోజుల్లో జరిగింది కూడా.

గాంధీజి తరువాత కాంగ్రెసును నడిపించ వలసిన వారిలో ముగ్గురు ప్రముఖుల్ని చెప్పుకునేవారు - నెహ్రూజీ, నేతాజీ, జయప్రకాష్ నారాయణ. గాంధీజీ నెహ్రూగారిని అభిమానించడం వల్ల, సోషలిస్టులు అల్ప సంఖ్యాకులుగా వుండడం వల్ల నేతాజీ సుభాష్ చంద్రబోస్ యుద్ధంలో ముఖ్యపార్టీ అయిన జర్మనీ పక్షం వహించాడు.

దేశాన్ని వదిలేసి జర్మనీకి పారిపోయాడు కూడా. అక్కడి నుంచి జపాన్‌తో కలిసి పూర్తిగా జర్మనీ పక్షం వహించి ఆజాద్ హింద్ ఫౌజ్ నిర్మించారు. సాయుధ బలాలతో దేశాన్ని బ్రిటిష్ పరిపాలన నుంచి విముక్తం చేసి స్వతంత్ర భారత్ రావడానికి సర్వసన్నద్ధుడై వున్నాడు.

## హిట్లర్ చేజార్చుకున్న అణ్వస్త్రం

అంతవరకు హిట్లర్ బెదిరిస్తున్న కొత్త ఆయుధం (అణ్వస్త్రం) అమెరికా స్వాధీనం కావడంతో యుద్ధ వ్యూహం తలక్రిందులై జపాన్ దాసోహం అనడం, హిట్లర్ ఓడిపోవడం జరిగింది. రష్యా మిత్ర పక్షాలు గెలిచి బ్రిటిష్‌వారికి భారత భవిష్యత్తు గురించి నిర్ణయం చేసే స్వేచ్ఛ లభించింది.

దేశంలోని కాంగ్రెసు ఉద్యమాన్ని సర్వనాశనం చేయగల విజయోత్సాహంతో బ్రిటిష్ ప్రభుత్వం ఉత్తేజితం అయింది. అయితే ఈ దేశంలో తాము ఎంతో కాలం పరిపాలించలేం అనే అపశృతులు కూడా స్పష్టంగా కనిపించ సాగడం వల్ల దేశానికి స్వరాజ్యం ఇచ్చివేయాలనే బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించు కున్నది.

నిజానికి యుద్ధకాలంలో తమకు సహాయం చేసిన మిత్రులైన కమ్యూనిస్టు పార్టీ కన్పించలేదు. ఉద్యమాన్ని ఒక వెల్లువలా కాంగ్రెసు నడిపిస్తుండడం వల్ల, తమను శారీరకంగా దేశం నుంచి గెంటివేయగల శక్తి ప్రజా సమూహానికి అప్పటికే లభించిందన్న వాస్తవం సర్వత్రా విజృంభించి కన్పించడం వల్ల, ఆ విజృంభణను తమకు వ్యతిరేకంగా ఉపయోగించగల శక్తియుక్తులు కాంగ్రెస్‌కే అధికంగా ఉండడం వల్ల విదేశీ ప్రభుత్వం పరిస్థితిని ఉన్న దున్నట్టుగా కాంగ్రెసుకు అప్పగించేసి తాను వైదొలగా లనుకొంది.

అప్పటి స్థితిలో నెహ్రూ, జిన్నా, డా॥ అంబేద్కర్ ముగ్గురు నాయకులు సమస్యను మూడు వైపుల నుంచి పట్టి ఉంచడం వల్ల కూడా ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరైంది. వీలైనంత త్వరలో ఈ తలనొప్పిని వదిలించు కోవాలనే తాపత్రయం ప్రభుత్వాన్ని తొందర పెట్టింది.

దేశం ముక్కలైనా అంటరాని కులాలకు న్యాయమార్గం లభించింది. పరిపాలనాధికారం కాంగ్రెసు చేతికి వచ్చింది. దేశం స్వతంత్రం అయ్యింది. నెహ్రూ ప్రధాన మంత్రి అయ్యాడు.

## కమ్యూనిస్టుల మోసం

ఇదంతా చరిత్ర. ఈ చరిత్రలో అనుకోని అపూర్వ ఘట్టం డా॥ అంబేద్కర్ కాంగ్రెస్ మంత్రివర్గంలో చేరడం, నూతన రాజ్యాంగ నిర్మాణం బాధ్యత ఆయనకు లభించడం. ఈ పరిణామాలు శుభ పరిణామాలైతే అదే సమయంలో అశుభ సంఘటనలు కూడా కొన్ని జరిగినై.

అందులో ఒకటి కాశ్మీరుపై దుండగుల దండయాత్ర. హిందూ, ముస్లిం పరస్పర హింసాకాండ. తూర్పు సరిహద్దులలో దురాక్రమణ. తాను సక్రమ మనుకొన్న పద్ధతిలో ఈ సమస్యలను నిర్వహించుకొంటూ వచ్చారు ప్రధానమంత్రి.

ఈ కాలంలో కమ్యూనిస్టుల పాత్ర అంతగా చెప్పుకో దగినట్టు లేదు. ప్రపంచ కార్మికులారా ఏకం కండి అన్న నినాదం ఇవ్వడం జరిగింది. అది ఒట్టి నినాదం గానే వుండిపోయింది.

కులనాయకత్వానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. అంటరాని వారి పేటలను లేబరు పేటలుగా మార్చే ప్రయత్నం జరిగింది. వీటి మూలాల నుంచి ఎన్నో వత్తిడులకు దేశం లోనవుతున్న క్లిష్టకాలంలో కమ్యూస్టులు చేసిందేమిటి?

ఇంత దూరం నుంచి, యాభయ్యేళ్ళ పూర్వం నుంచి ఆనాటి పరిస్థితులను గమనిస్తే, కమ్యూనిస్టుల పాత్ర అంత ప్రతిభావంతంగా ఉన్నట్టులేదు. పరిపాలనకు, ప్రజాధిపత్యానికి కావలసిన దూరదృష్టి, పరిశీలనాశక్తి వారిలో వికసించినట్టు లేదు. పైగా సంకుచిత మయిపోయన దృష్టాంతాలు చాల కన్పిస్తున్నయ్.

అందులో ప్రధాన మైనది హరిజన పేటలను అలాగే వుంచేసి, వాటికి లేబరు పేటలని పేరు పెట్టడం. ఎస్సీ యువకులను నాయకత్వ పరిధి లోనికి రానివ్వక పోవడం, అంటరానితనాన్ని పాటించడం, దానిని ముఖ్యంగా పట్టించుకోక పోవడం, పేదరికాన్ని నిర్మూలించడానికి ఏ విధమైన కృషి చెయ్యకపోవడం, ప్రశ్నించే వారికి తమ రాజ్యం వచ్చేవరకు ఆగమని జవాబివ్వడం. కమ్యూనిస్టు వ్యతిరేకమైన, సిద్ధాంత విరుద్ధమైన చర్యలు చేపడతామని ప్రచారం చెయ్యడం.

కమ్యూనిస్టు పార్టీ అవలంబించిన ఈ పద్ధతులన్నీ చదువుకొన్న ఎస్సీల లోను, కొంచెం తెలుసుకొన్న ప్రజలలోను ఆ పార్టీ పట్ల వ్యతిరేకభావాన్నే కలిగించ గలిగాయి. అట్టి అయోమయ స్థితిలో కమ్యూనిస్టులు శ్రీశ్రీని ఆశ్రయించారు. అప్పటికి కలత నిదురలో కలలు కంటున్న శ్రీశ్రీ కమ్యూనిస్టులకు ఆశ్రయంగా వారితో చేరాడు.

కలత నిదురలో కలలు రావనేది నా అనుభవం. కలత నిదురలో కాంచిన కలలు గాలి మేడలై కూలిపోయా యంటాడు శ్రీశ్రీ. జాగృతికి, సుషుప్తికి మధ్యది స్వప్నావస్థ. స్వప్నావస్థ అసలు ఒక అవస్థే కాదు. కలత నిదురలో వచ్చే వాటిని కలలు అని చెప్పడం కుదరదు. అప్పటి శ్రీశ్రీ కలలు గాలి మేడలై కూలినా, స్వప్నావస్థను మురికి మడుగు చేసినా పట్టించుకో నక్కరలేదు.

## మహాప్రస్థానం

మహా ప్రస్థానం అనేది మహా భారతంలో ఒక పర్వం పేరు. పాండవులు రాజ్యం వదిలేసి పై లోకాలకు ప్రయాణమైన పర్వం అది. శ్రీశ్రీ కవితలకు ఈ పేరు

పెట్టడంలోనే భారతీయ పండిత పామర మేధావిత హృదయంలో స్థానం లభించింది.

స్వరాజ్యం వస్తూ వస్తూ వున్న రోజులవి. పదండి ముందుకు అంటే మరో ప్రపంచం వైపు. మరో ప్రపంచం అంటే స్వరాజ్యం. విదేశీ దాస్యం నుంచి విముక్తమై స్వతంత్ర భారతంకేసి పదండి అని పాటకు అర్థం. అప్పట్లో శ్రీశ్రీకి ఉన్న ఆలోచన ఇదే. ప్రజలు అర్థం చేసుకొన్న వాస్తవమూ ఇదే. ఈ పాట ఎత్తుగడలో కాని, పాటలో గాని ఎక్కడా రష్యాలేదు. కమ్యూనిజం లేదు.

ఇక్కడొక వివరణ. ఆగస్టులో వ్యష్టి సత్యాగ్రహాల్లో శిక్ష పొంది, విడుదలై వచ్చిన కాంగ్రెసు నాయకులు, కాకినాడలో అరెస్టు అయిన వాళ్ళు, పశ్చిమ గోదావరిలో చెంచినాడలో అనుకుంటాను, ఏర్పాటు చేసిన మహాసభలో కాంగ్రెసు గాయకులచే ఈ పాట పాడించబడింది. తంబూరా మీటుతూ 'భజగోవిందం' బాణీలో, మరో ప్రపంచం, మరో ప్రపంచం అంటూ సభ ప్రారంభంలో పాడారు.

ఆ పాట అలా కాదు పాడడం అంటూ నేను లేచి వీరావేశంతో పాడాను. సభంతా ఏకగ్రీవంగా మెచ్చుకున్నారు. ఆ పాట పాడవలసిన పద్ధతి అదే అన్నారు.

ఈ విషయం ఇక్కడ ఎందుకు ప్రస్తావిస్తున్నా నంటే, ఈ మరో ప్రపంచం పాటను వందేమాతరంలా జాతీయగీతంగానే, ఉద్యమాన్ని ముందుకు నడిపించే ఆవేశ గీతంగానే పరిగణించా రందరూ. కాంగ్రెసు నాయకులు, కాంగ్రెసు సోషలిస్టులు కూడా.

కమ్యూనిస్టులు విడిపోయి, కాంగ్రెస్సు వ్యతిరేకులై పూర్తిగా రష్యా నాయకత్వాన్ని స్వీకరించి నందువల్ల, ఎరుపు రంగును ఎఱ్ఱ జెండాను స్వంతం చేసుకోవడం వల్ల ప్రత్యేక వ్యక్తిత్వాన్ని సంతరించుకొన్నారు. ప్రత్యేక పార్టీగా ఉద్యమించారు.

కాంగ్రెసులోని అభ్యుదయ వాదు లందరూ కాంగ్రెసు సోషలిస్టుల పేరుతో జరిపిన చివరి మహాసభ 1940 ప్రాంతంలో రాజమండ్రిలో జరిపిన మహాసభే అనుకుంటాను. కాంగ్రెసు సోషలిస్టు నుంచి ఆ తర్వాత కమ్యూనిస్టు పూర్తిగా విడిపోవడం జరిగింది.

స్వరాజ్యం వచ్చిన కొత్త రోజుల్లో దేశాన్ని కమ్యూనిస్టు దేశంగా మార్చడం కోసం కమ్యూనిస్టులు కొంత తీవ్రంగానే ప్రయత్నించారు. అంతకంటె ఎక్కువ తీవ్రంగా కాంగ్రెసు ప్రభుత్వం ఆ ఉద్యమాన్ని అణిచివేయగలిగింది. కమ్యూనిస్టు నాయకులు, ఎక్కువగా హరిజన, గిరిజన, బహుజన యువకులు పోలీసుల ధాటికి గురై బాధలు పడడం, ప్రాణాలు కోల్పోవడం కూడా జరిగింది. దాని ఫలితమే 1952 ఎన్నికలలో ఆంధ్రలో ప్రతిబింబించింది. ఆ ఎన్నికలలో నేనొక కాంగ్రెసు అభ్యర్థిని కనుక నాకు ప్రత్యక్షంగా ఈ విషయాలు తెలుసు.

సవర్ణ కులాల కమ్యూనిస్టు నాయకులు పోలీసులు తరుముకొస్తుంటే పారిపోయి హరిజన పేటలలో దూరేవాళ్ళు. పోలీసులు ఆ పేటలపై పడి విచక్షణా రహితంగా చావ బాదేవాళ్ళు.

కమ్యూనిస్టు నాయకులు కన్పించేవాళ్ళుకాదు. వాళ్ళు మరోవైపు పారిపోయి వాళ్ళ బంధువులైన కాంగ్రెసు అగ్రనాయకుల ఇళ్ళల్లో దాక్కునేవారు. అక్కడకు పోలీసులు వెళ్ళరు కదా. హరిజన పేటలలోనే వెతుకుతూ నానా అల్లరి చేసే వాళ్ళు.

ఇలా చేయడం న్యాయం కాదని నేను ఒక కమ్యూనిస్టు నాయకమిత్రుణ్ని ప్రశ్నించగా ఈ విధానం తెలిసే అనుసరిస్తున్నామనీ, బడుగు బతుకులకు ప్రభుత్వంపై వ్యతిరేకతను పెంపొందించడమే తమ ధ్యేయమని చెప్పాడాయన. ఆ విధంగా మాల మాదిగ పేటల్లో కమ్యూనిస్టులు స్థిర పడ్డారు. ప్రభుత్వం పట్ల వ్యతిరేకత పెరిగింది.

## తప్పు దారులు

అదే కాలంలో కమ్యూనిస్టు కార్యవర్గ సమావేశాలు సవర్ణ నాయకుల ఇళ్ళలో జరిగేవి. అక్కడకు హరిజన కమ్యూనిస్టు యువకులకు ప్రవేశం ఉండేది కాదు. ఇదేమి న్యాయమని అడిగితే ఇప్పుడే మనం తీవ్ర సంస్కరణల జోలికి పోకూడదు అని జవాబు చెప్పేవాళ్ళు. మన రాజ్యం వచ్చిన తర్వాత అన్నీ సర్దుకుంటాయి అని చెప్పేవాళ్ళు.

ఇటువంటి పద్ధతులకు నిరసనగానే హరిజన యువకులు ఎక్కువగా కాంగ్రెసు

పార్టీలో చేరడం జరిగింది. నంబూరి శ్రీనివాసరావు, బొజ్జా అప్పలస్వామి, ఈలి వాడపల్లి, మూర్తి, కూర్మయ్యలను అనుసరించి కాంగ్రెసులో చేరింది ఆ కాలంలోనే.

అందుకే కమ్యూనిస్టు పార్టీ విస్తరించలేక పోయింది. ఇటువంటి పార్టీని నమ్మి శ్రీశ్రీ వంటి మహాకవులు కమ్యూనిస్టులు అయ్యారంటే ఆయన రచనల్లో ఎక్కడా ఆధారాలు దొరకవు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం), విప్లవ రచయితల సంఘం (విరసం) శ్రీశ్రీని పట్టుకొని వేలాడేయే తప్ప శ్రీశ్రీ మనస్ఫూర్తిగా కమ్యూనిస్టు కాలేదు. అందుకు అతని సినిమా పాటలు మొత్తం అన్నీ తార్కాణాలు. ఇతర కవితలు సరేసరి?

పదండి ముందుకు పదండి తోసుకు
పోదాం పోదాం పైపైకి

అనే పాట కూడా మొట్ట మొదట కాంగ్రెసు వారి జాతీయోద్యమ ప్రగతికోసం వ్రాసినట్టిది.

ఈ పాటలో శ్రీశ్రీ వ్రాసిన ఈ పంక్తులు చిత్తగించండి.

"స్వరాజ్యమే మన జన్మ హక్కని
సమస్త జగతికి చాటండి"

"స్వరాజ్య వాదీ ధరించు ఖాదీ
పరాయి సరుకులు మనకేల"

"అహింసయే మన ఆయుధము
సత్యాగ్రహమె మన సాధనము"

"త్రివర్ణ సుందర పతాకము
భారత దాస్య విమోచనము"

"ప్రేమ శాంతి ధర్మము నిండిన
రామ రాజ్యమే మన ఆశయం"

ఇటువంటి అద్భుతమైన భావాలతో కాంగ్రెసు వారి జాతీయోద్యమాః

నడిపించిన గేయం ఈ పదండి ముందుకు. ఇదొక పెద్ద గేయం. హరిజనోద్యమానికి, మద్య నిషేధానికి, పన్నుల నిరాకరణకు సంబంధించిన మంచి చరణాలు ఈ గేయం నిండా వున్నయ్.

జాతీయోద్యమం పట్ల ఎంత భక్తితో శ్రీశ్రీ త్రివర్ణ పతాకానికి అంజలి ఘటించాడో, ఎర్రబావుటా ధగధగలకు కూడా అదే భక్తి ప్రపత్తులతో అంజలి ఘటించాడు. కాంగ్రెసు పార్టీ అయినా, కమ్యూనిస్టు పార్టీ అయినా మహాకవి శ్రీశ్రీకి ఒకటే. మహాకవిగా ఆయనకు కావలసింది ప్రజా శ్రేయస్సు, ప్రగతి ఉషస్సు.

## అంతర్మథనం

జాతీయోద్యమం ప్రజాశ్రేయస్సు వైపు గాక కొందరు దొరల వ్యక్తిగత శ్రేయస్సు వైపు మరలుతున్నదని గ్రహించిన శ్రీశ్రీ కమ్యూనిస్టు పార్టీని బలపరిచే టప్పుడు ఎంత అంతర్మథనానికి లోనయ్యాడో ఆయన వ్రాసుకొన్న వీణపాట వివరిస్తూ ఉన్నది.

ఈ వీణపాట శ్రీశ్రీ తన స్వంతానికి వ్రాసుకొని ఏకాంతంగా పాడుకున్నాడని నా ఉద్దేశం. తర్వాత దానిని 'భార్యాభర్తలు' సినిమాలో తెర కెక్కించడం జరిగిందనుకుంటాను.

ఏమని పాడెదనో ఈ వేళ
మానసవీణ మౌనముగా నిదురించిన వేళ

జగమే మరచి హృదయ విపంచి
గారడిగా విను వీధి చరించి
కలత నిదురలో కాంచిన కలలే
గాలిమేడలై కూలిన వేళ

వన సీమలలో హాయిగా ఆడే
రాచిలుకా నిను రాణిని చేసే
పసిడి తీగల పంజర మదిగో
పలుక వేమని పిలిచే వేళ

ఈ పాట విన్న తర్వాతనే శ్రీశ్రీ సామాన్య కవి కాదనీ, ఉన్నతోన్నతుడైన మహాకవి అని నేను గుర్తించడం జరిగింది. ప్రపంచానికే ఉన్నతోన్నతుడైన మహాకవి తప్ప ఇటువంటి గేయం మరొకడు వ్రాయలేడు. ఎంత మథన పడ్డాడో, ఎంత కఠినమైన నిర్ణయం తీసుకొన్నాడో ఊహించసాధ్యం కాని క్లిష్ట సన్నివేశం అది.

స్వరాజ్యోద్యమం అంతవరకూ వీణ వలె వినిపిస్తూ వచ్చింది. సర్వ ప్రజా సమసమాజం రామరాజ్యంగా ధగధగ మెరుస్తూ వచ్చింది. విదేశ దొరల దాస్యంతో పాటు స్వదేశ దొరల నిరంకుశత్వం అంతరిస్తుందనుకొన్న శ్రీశ్రీ తన కలలు కల్లలైపోతున్నందుకు నిజంగా ఏడ్చి ఉంటాడు.

పాడడమే స్వభావంగా గల కవి తాను, అంతవరకూ మ్రోగిన హృదయ వీణ మౌనంగా నిద్రపోయింది. ఇక ఏమి పాడతాడు? ఏమని పాడగలడు ? అదే సమయంలో ఒక పసిడి తీగల పంజరం, అందులో ఒక మహారాణి తనను పేరుపెట్టి పిలుస్తున్నాయ్. అటు వెళ్లడమా, తన స్వేచ్ఛ ఏమైపోవాలి ? వీణ ఇక మ్రోగదా ? తన గొంతు మూగ పోయినట్టిదా ! ఆత్మీయమైన మథనం ! అంతర్మథనం !

## పంజరంలో చిలుక

విశ్వాంతరాలలో హాయిగా స్వేచ్ఛగా విహరించే రామచిలుక తాను, తన కవితా విపంచి విను వీథులను మారు మ్రోగించి ఎవరో గారడీ చేసినట్టు క్రమంగా మూగ బోయినప్పుడు గిలగిలలాడి పోయిన తాను, పంజరంలో నయినా రాణి పదవి దక్కుతుందనే భ్రాంతిలో అటు ఆకర్షితు డయ్యాడనుకోవచ్చు. కమ్యూనిస్టు యువకులు పిల్చారు. తాను సాహితీ నాయకత్వ పీఠాన్ని అధిరోహించాడు. మూగబోయిన స్వేచ్ఛా విపంచి పంజరంలో తిరిగి గొంతు విప్పింది.

ఈ సందర్భంలో శ్రీశ్రీ గొప్పతనం ఏమిటంటే పంజరానికి చిలుకకు కూడా న్యాయం చేయాలనుకోవడం. అది పంజరం అని తెలుసు. తను రామచిలుకా అని తెలుసు.

రామచిలుక పంజరాన్ని ప్రేమిస్తుందా ? ప్రేమించకపోయినా తన చుట్టూ గల పిల్లులకు, కుక్కలకు బెదిరి పంజరాన్ని వదిలి పెట్టే సాహసం చేయ గలుగుతుందా ? పంజరాన్ని ఎలాగూ ప్రేమించదు. వదిలిపెట్టి బయటకు వస్తే ఏమో ?

అట్టి క్లిష్ట పరిస్థితులలో చివరి వరకూ కమ్యూనిస్టు పార్టీనే వదలకుండా పట్టుకొని శ్రీశ్రీ నెట్టుకు వచ్చాడంటే ఆయన ధైర్య సాహసాలతో పాటు లోకజ్ఞత కూడా గొప్పదే అనవచ్చు. కమ్యూనిస్టు యువకులు కూడా శ్రీశ్రీలో వ్యక్తిగతంగా ఎన్ని లోపాలున్నా సహిస్తూ, ఆయన సహచర్యాన్ని నిలుపుకుంటూ వచ్చారు. ఈ వాస్తవాన్ని ఇక్కడ నేను వివరించడంలేదు. అది జగమెరిగిన చరిత్ర.

పసిడి తీగల పంజరాన్ని వరించి అందులో చేరినా, తన స్వభావాన్ని అనుసరించి శ్రీశ్రీ వ్రాసిన పాటలే సినిమా పాట లన్నీ.

## ఈ హెచ్చరిక అందరికీ

సినిమా పాటలను మాత్రమే తీసుకొని శ్రీశ్రీ జీవితాన్ని అంచనా కట్టడం న్యాయం కాదేమో అంటూ మా చిన్నమ్మాయి విజయేందిర ఒక హెచ్చరిక విసిరింది నాకు.

సినిమా పాటలు వేరు, కమ్యూనిస్టుగా శ్రీశ్రీ జీవితం వేరు కావచ్చు గదా అని కూడ అన్నది. అప్పుడు శ్రీశ్రీని రెండు వ్యక్తిత్వాలు గల మనిషిగా పరిగణించవలసి వుంటుంది.

శ్రీశ్రీ మమూలు మనిషి అయి ఉంటే, ఏ రాజకీయ నాయకుడో అయి వుంటే ఆయనకు రెండు విధాల వ్యక్తిత్వాన్ని, ద్విపాత్రాభినయాన్ని ఆపాదించి ఉండేవాణ్ణి. శ్రీశ్రీ సామాన్య వ్యక్తి కాదు కదా ! ఆయన రామచిలుక పాత్ర ధరించిన వాడు కాదు. రామచిలుకగానే పుట్టి పెరిగి, రామచిలుకగానే బ్రతికిన వాడు. చిలుక పంజరంలో ఉన్నా చిలుకే. నరం లేని నాలుక గల మనిషి కాదు. మనుషుల మాటల్ని కొన్నింటిని పలికినంత మాత్రం చేత చిలుక మనిషి అవుతుందా? శ్రీశ్రీ

పతితులార - భ్రష్టులార
బాధా సర్ప ద్రష్టులార
దగాపడిన తమ్ములార
ఏడవకం డేడవకండి

అంటూ కమ్యూనిస్టు పలుకులు కొన్ని పలికినంత మాత్రం చేత శ్రీశ్రీని కమ్యూనిస్టు అనడానికి తార్కాణం లేదు. శ్రీశ్రీ కవి. ఉత్తమ శ్రేణి కవి. కవి పుడతాడు. మలచబడడు.

భావజాలం వేరు, జీవితం వేరుగా బ్రతికే వాడు బానిస అవుతాడే తప్ప స్వతంత్ర మానవుడు కాలేడు.

బానిసకు వాక్స్వాతంత్ర్యం ఉండదు. జీవిత స్వేచ్ఛ వుండదు. తన యజమానికి కష్టం కలిగే విధంగా మాట్లాడ కూడదు. కిట్టని విధంగా మసలుకో గూడదు. భావాలు, మాటలు, చేతలు కూడా యజమాని పరంగానే నడవాలి.

స్వతంత్ర భారత్‌లోని వ్యక్తి ఏ పార్టీకి చెందినా బానిస మాత్రం కాదు. ముఖ్యంగా శ్రీశ్రీకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో కూడిన అన్ని సౌకర్యాలు, అన్ని అవకాశాలు వున్నయ్. సర్వమానవ స్వేచ్ఛా సౌకర్యాలు కలిగించి నట్టిదే కాంగ్రెసు పార్టీ.

అట్టి అవకాశాలు లేని కమ్యూనిస్టు పార్టీ పంజరం అన్నాడు. పంజరం అని తెలిసే అందులో ప్రవేశించాడు. పంజరానికి అనుకూలంగా మెలిగితే మెలిగి ఉండవచ్చు. అంతమాత్రం చేత పంజరమే ఆయన అనుకోకూడదు.

ఒక కవిగా, ఒక అమాయకుడైన భావుకుడిగా, ఒక ఉత్తమ భావనాశాలిగా శ్రీశ్రీ స్వేచ్ఛగా హాయిగా గొంతెత్తి పాడాడనే నేననుకొంటున్నాను. కొన్ని కొన్ని చోట్ల మొత్తం ప్రపంచంలోనే ఆయనను మించిన కవి లేడు అన్నంత గొప్పగా పాడగలడు.

ఈ పాట వినండి

పాడవేల రాధిక
ప్రణయ సుధా గీతిక
ఈ వసంత యామినిలో
ఈ వెన్నెల వెలుగులలో
జీవితమే పులకించగ
నీ వీణను సవరించి

గోపాలుడు నిను వలచి
నీ పాటను మది తలచి
ఏ మూలనో పొంచి పొంచి
వినుచున్నాడని ఎంచి

వేణు గాన లోలుడు నీ
వీణా మృదు రవము విని
ప్రియ మారగ నిను చేరగ
దయ చేసెడి శుభవేళ

కవితా దృష్టితో విశ్లేషించి నప్పుడు, ఈ ఒక్క పాటకు నోబెల్ అవార్డును ఇవ్వవచ్చును కదా !

కవిత అంటే జీవితమే అనుకొన్నపుడు, సహజత్వమే జీవిత మాధుర్యం అనుకొన్నపుడు ఎంత సహజ సుందరమైన కవిత్వాన్ని ఈ పాటలో నింపగలిగాడు శ్రీశ్రీ !

వాగర్థ ప్రతిపత్తి గల రాధాకృష్ణ ప్రతీకగా భారతీయం ప్రధానంగా రూపుదిద్దుకున్న ప్రకృతి పురుష భావాన్ని ఈ పాటలలో పొదిగి అందజేశాడు లోకానికి.

## రాధ - వీణ

రాధ పాడుతుంది. నిరంతరంగా పాడుకొంటూ ఉంటుంది. తన ప్రియుడు ఎక్కడ నుంచో వింటున్నా డనుకొన్నపుడు మరీ మధురంగా పాడుకొంటుంది. వింటున్నాడో లేడో ! వాస్తవాలను అటుంచి, వింటున్నాడనుకొని పాడ మంటున్నాడు రాధను ! ఇంతకంటె మధురతర భావనా సుధారసం ఇంకే ముంటుంది ? ఇది కదా పరిపూర్ణ పూర్ణసాహితీ రస కుంభం !

ఈ శతాబ్ది నాది అని శ్రీశ్రీ అనగలిగా డంటే అందుకు ప్రోత్సాహకం ఆయనలోని కవితా శక్తి. తెలుగు సరస్వతి పలికించిందాపలుకు. శ్రీశ్రీ హృదయంలో నుంచి అదే పలికిందో ఏమో !

అధునా కవితా శాఖాం
వందే శ్రీశ్రీ ధీ కోకిలం

అని అంటూ, ఈ శతాబ్దం అంతా పాడుకోవలసిన ఉన్నత స్థాయి అతని కవితది అంటున్నాను నేను.

కమ్యూనిస్టుకాదు అన్నదానికి తార్కాణం

**నేను సైతం విశ్వశాంతికి**
**సమిధ నొక్కటి ఆహుతిచ్చాను**

అంటాడు శ్రీశ్రీ ఒక కవితలో.

సమిధ అనే పదం పూర్తిగా వేద సాంప్రదాయం. విశ్వశాంతి యజ్ఞకుండంలో తన సమిధ కూడా కాలుతూ ఉన్నదన్నమాట. ఇంతకన్నా సనాతన సంప్రదాయం మరొకటేముంది? ఇక్కడ వర్గపోరాటం లేదు. శాంతి యజ్ఞం వుంది.

ఇదే విధంగా ఒక్క సినిమా పాటల నుంచే గాక తను స్వీయానందం కోసం వ్రాసుకొన్న కవితలన్నిటి నుంచీ ఇలాంటి వుదాహరణ లివ్వవచ్చు.

## అనౌచిత్యాలు

మన పూర్వ సాహిత్యం నిండా, ముఖ్యంగా మహాకవులుగా మన మారాధించే పండిత కవుల తెలుగు అనువాదాలలో, మూలాన్ని విడిచి వెళ్ళే సందర్భాలలో చాలా అనౌచిత్యాలు ఉంటయ్. నన్నయ్య తిక్కన, పోతన, పెద్దన మొదలగు మహాకవుల రచనల నిండా అనేక అనౌచిత్యాలున్నయ్.

అందులో పోతన లోని కొన్నింటిని నా "చివరి మెట్టు మీద శివుడు" కావ్యంలో ఉల్లేఖించి ఉన్నాను. నన్నయ్య తన రచన నిండా బ్రాహ్మణ పదాలతో నింపి పెట్టాడు. పెద్దన ధర్మాన్ననుసరించి సూర్యుడ్ని తప్పుపట్టాడు. ఇలా చాలా చూపవచ్చు. పూర్ణ చంద్రుడిలో మచ్చలుంటాయ్ మరి ! శ్రీశ్రీ రచనల్లోనూ ఉన్నయ్.

కవి యొక్క కవితా ధర్మాలలో ఒకటి వికృతత్వాన్ని నిరాకరించి సౌందర్యాన్ని పోషించడం. గొంగళి పురుగులో సీతాకోక చిలుకను చూడగలగడం. సీతాకోకచిలుకలో గొంగళి పురుగును చూచి అసహ్యించుకోవడం కవిత ధర్మం కాదు.

శ్రీశ్రీ చంద్రుణ్ణి వర్ణిస్తూ ఎడారిలో కాళ్ళు తెగి పడి వున్న ఒంటరి ఒంటెలా

వున్నాడు చంద్రుడు అంటాడు. చంద్రుణ్ణి అంత అసహ్యంగా వర్ణించాడు. ఈ వర్ణన చేసిన వాడు ఏ విధంగాను కవి కాజాలడు అన్నాను నే నందుకే ఒకప్పుడు.

# కొత్త పాటలు

అభ్యుదయ రచయితలుగాని, విప్లవ రచయితలుగాని తమ రచనలలో విప్లవాన్నికాని, విప్లవ ప్రచారాన్నికాని తగు మాత్రంగానైనా సాధించలేకపోయారు. అభ్యుదయ రచయితలుగా తాము ఎక్కువగా రాణించలేమని మొట్ట మొదటిగా గుర్తించిన తెలివైన యువకులు ఆరుగురు విడిపోయి దిగంబర కవులుగా ప్రాచుర్యంలోకి వచ్చారు.

అందులో ముగ్గురు నాకు బాగా తెలిసిన వాళ్ళు. ఒకరు మరీ సన్నిహితుడు. వాళ్ళు చేసిన రచనలు, చేసిన పనులు గమనించిన తరువాత నా సన్నిహితడైన రచయితను అడిగితే నిజం ఒప్పేసుకున్నాడు – తాము కొత్తదనం కోసం విడిపోలేదని కేవలం ప్రాచుర్యం కోసమే విడిపోయామని.

దిగంబరత్వం అంటే కేవలం బూతు మాటలు ప్రయోగించడమేనా ? బూతులు కూడా కాదు, పచ్చి బూతు మాటలు మాత్రమే.

అట్టిస్థితిలో, తాను ప్రతి సంవత్సరమూ వ్రాసే సాహితీ సమీక్షలో శ్రీవాత్సవ (యండమూరి సత్యనారాయణ) వ్రాసిన ఒక వాక్యం వెలుగులోకి వచ్చింది.

"దిగంబర కవిత్వానికి సరియైన ఉదాహరణ బోయి భీమన్నగారి రాగవైశాఖి. అంత కంటె దిగంబర కవుల మనుకొనేవారు వ్రాయగలిగిందేమిటి?" అనేది ఆ వాక్యం.

నిజానికి రాగవైశాఖి ఒక శృంగార లేఖా కావ్యం. దిగంబర కవిత్వం కాదు. కవితా శైలిలో వ్రాసిన వచన కావ్యం అది. శృంగార రస స్ఫూర్తిలో పూర్వకావ్యాలు దేనికీ తీసిపోని రచన. దానిని 'అశ్లీలం' పేరుతో నిషేధించమన్న ఆందోళన కేవలం భ్రాంతి మాత్రమే. అలంకారం దాల్చిన మూర్తి అయినప్పటికి శ్రీవాత్సవ గారి పోలికలో వాస్తవం ఉంది.

ఈ వాస్తవాన్ని ఎందుకు ప్రస్తావించానంటే. సమాజంలో మార్పును కోరే రచన రాగవైశాఖి. గతానుగతికంగా సాగుతున్న సాహిత్యాన్ని మలుపు తిప్పి విప్లవాన్ని వ్యంగ్య పద్ధతిలో ప్రచారం చేసిన రచన నండూరి వారి "ఎంకి పాటలు" ఒక్కటే.

**ఊరెళ్తనని చెప్పి**
**మారేస మేసుకొని**
**శకునాల పాటొచ్చు**
**శకున మడుగన్నావు**
**ఉత్తమాటలు నీవి పొమ్మందిరా ఎంకి**
**కొత్త పాటలు పాడుకొమ్మందిరా**

ఈ పాటను ఈ దేశంలోని కమ్యూనిస్టు పార్టీకి వర్తింపజేస్తే ఎలా వుంటుందో చూడండి.

సాగుతున్న సామాజిక స్థితిని మార్చేస్తా మన్నారు. ఊరెళ్తనని చెప్పారు. కాంగ్రెసు వేషం తీసేసి కమ్యూనిస్టు వేషం వేసుకున్నారు. శకునాల పాటొచ్చునన్నారు. అంటే యజమానుల స్థానాలలో కార్మికులను కూర్చోబెడతా మన్నారన్నమాట.

సమాజాన్ని రెండు వర్గాలుగా విభజించారు. ఆ రెండు వర్గాల మధ్య నిత్య పోరాటం సహజమన్నారు. పోరాట విజయం అంటే కార్మిక విజయం. కార్మిక రాజ్యం. మొత్తం సమాజాన్ని కార్మిక వర్గం పరిపాలిస్తుందన్నమాట.

రష్యాను ఆదర్శంగా చూపించారు. రష్యా విప్లవం రైతుకూలీ విప్లవం కాదన్న సత్యాన్ని మరుగు పరిచారు. నిజానికి రష్యా విప్లవం సైనిక చర్య విజయం. రష్యా కమ్యూనిస్టు నాయకత్వం నియంతృత్వ నాయకత్వం. కమ్యూనిస్టు పార్టీ కేవలం నామ మాత్రం. డిక్టేటరువే సర్వాధికారాలు.

ప్రభుత్వంలో ఏం జరుగుతున్నదో ఎవరికీ తెలియదు. ఎక్కడి కక్కడ ఇనుప తెరలు. మనిషికి మనిషికీ మధ్యగోడ. రష్యాలో కమ్యూనిస్టు రాజ్యం భయభీతులతో నడిచినట్టిది. ఆనాడు రష్యాలో ఉన్న భావాలు, రచనలు, తెలుగులోకి అనువదించుకొని ఇక్కడ ప్రచారం చేశారు.

గర్జించు రష్యా అంటూ ఎఱ్ఱ బావుటా ధగధగలు చూపించి యువతను కొన్ని విభ్రాంతి భ్రమలలో ముంచెత్తారు. ఇదంతా శకునాల పాట. ఇది తమకు వచ్చు.

ఎంకి తెలివైన పౌరసత్వానికి ప్రతీక.

నీ వన్నీ ఉత్తమాటలు పొమ్మంది. కొత్త పాటలు పాడుకొమ్మంది.

రష్యాలోని కమ్యూనిస్టు ప్రభుత్వ వ్యవస్థ తుస్సుమన్న వాస్తవాన్ని ఎంకి భవిష్యద్వాణిగా ఆనాడే చెప్పింది. అదంతా వట్టి మాయ, ఉత్తది. వర్గ పోరాటం నుంచి కార్మిక రాజ్య స్వర్గ సుఖాల వరకు అంతా భ్రమ, మాయ అవన్నీ, ఉత్త మాటలు.

ఎంకికి తెలుసు.

అతడు వేసుకొన్నది మారు వేషమని, పలుకుతున్నవి చిలుక పలుకులని, ప్రచారం చేస్తున్నవి కలత నిదురలో కలలని, నిజమైన పరివర్తనకు అది మార్గం కాదని.

ఎంకి సామాన్యురాలు కాదు. ఆనాటి సమాజ చైతన్యానికే ప్రతినిధి. రాసోరి యింటి కైన రంగు తెచ్చే పిల్ల. ఎంకి పాటల్లోని భావాలను విశ్లేషిస్తే సమాజం లోని రావలసిన మార్పు, కావలసిన మార్పు ద్యోతక మౌతుంది.

## శ్రీశ్రీ తో నా పరిచయం

నాకు శ్రీశ్రీతో పరిచయం అంతగా లేదు. అసలు పరిచయమే లేదనవచ్చు. సమావేశాల్లో చూడడమే తప్ప మాట్లాడుకోవడం లేదు. అయితే ఆయనను గురించి నాకు బాగా తెలుసు. నా గురించి కూడా ఆయనకు కొంతైనా తెలిసి ఉండాలి.

ఒకసారి నేను నిర్వహిస్తున్న ఒక కార్యక్రమంలో పాల్గొన వలసిందిగా శ్రీశ్రీ గార్కి ఒక లేఖ వ్రాశాను. అదేదో ముఖ్యమైన కార్యక్రమం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిర్వహణ సంఘానికి నేను కార్యదర్శి ననుకొంటాను – తిన్నగా జ్ఞాపకం లేదు.

అప్పటికే శ్రీశ్రీ ప్రసిద్ధుడు కనుక ఆయన పాల్గొనడం సమంజసంగా ఉంటుందని వ్రాశాను. తను హైదరాబాదుకు రాలేనని, కార్యక్రమంలో పాల్గొన లేనని నాకు జవాబిచ్చారు. ఎందుకు పాల్గొనలేదో ఆ లేఖలో వివరించారు.

ఆ లేఖ సారాంశం ఇది.

"నేను పాల్గొనలేక పోవటానికి కారణం డబ్బు లేకపోవడం. మద్రాసును వదిలిపెడితే తిరిగి నేను మద్రాసు చేరే వరకు ఖర్చు చాలా అవుతుంది. అది మీరు భరించలేరు. ప్రభుత్వం ఇవ్వదు. నా అవసరాల కయ్యే ఖర్చు భరించలేరు. శ్రీశ్రీ అంటే ఆర్థికంగా బాగా ఉన్నవాడనుకొంటారు. కాని నేను ఏమీ లేని వాణ్ణి. సినిమాలలో వచ్చే ఆదాయం తిండికి చాలదు. ఏదో అప్పుడప్పుడు కొద్ది కొద్దిగా నిలువ చేసుకొంటే మిత్రులు పట్టుకుపోతూ వుంటారు. తిరిగి ఇవ్వడ మనేది వుండదు. ఉన్న ఇల్లు తనఖాలో ఉంది. బ్యాంకులో ముప్ఫైవేలు ఒక ప్రొడ్యూసరు అత్యవసరమని చెప్పి దానిని చేతి అప్పుగా పట్టుకుపోయాడు. అతడు మళ్ళీ కనిపించలేదు. ఇదే నా పరిస్థితి. కనుక రాలేను."

ఇది లేఖ పూర్తి పాఠం కాదు. లేఖలోని విషయాలు మాత్రం ఇక్కడ పేర్కొన్నాను. అయితే సినిమాలలో గేయ రచయితగా అంత సుప్రసిద్ధుడైన శ్రీశ్రీ అంత ఆర్థిక దుస్థితిలో ఉన్నాడంటే నాకు నమ్మకం కలుగలేదు.

కాని ఆ తర్వాత శ్రీశ్రీ సన్నిహితుడైన ఒక డాక్టరు మిత్రుడు ఆర్థిక దుస్థితి నిజమే అని ధృవపరిచాడు. ఏవో కబుర్ల సందర్భాలలో శ్రీశ్రీ ప్రస్తావన వచ్చి ఆయన లేఖలో వ్రాసిన విషయాలు నిజమేనని, క్లిష్టస్థితిని తొలగించడానికి ఇక్కడ కమ్యూనిస్టు కుర్రవాళ్ళు ఆయనకు సన్మానం చేసి ఆర్థిక లోపాల్ని సరిదిద్దడానికి ప్రయత్నించారని, కాని అది పూర్తిగా విజయవంతం కాలేదని చెప్పాడు.

శ్రీశ్రీకి, కమ్యూనిస్టు కుర్రవాళ్ళకి వున్న సంబంధం చాలా విపరీతమైంది. ఈ పుస్తకంలో నేను పేర్కొన్న కొన్ని విషయాలు ఇప్పటి వాళ్ళకు నమ్మశక్యంగా ఉండవు. కాని శ్రీశ్రీ సమకాలికులకు, నిష్పాక్షికంగా పరిశీలించే వాళ్ళకు అవన్నీ సర్వ సాధారణ విషయాలే. ఒకరి నొకరు ఎలా బోల్తా కొట్టించుకొంటూ వచ్చారో ఒక్క విషయం చెపితే అర్థమవుతుంది. అది 'ఖడ్గ సృష్టి'కి జాతీయ అవార్డు వచ్చిన సందర్భం.

శ్రీశ్రీ గారి 'ఖడ్గ సృష్టి' కి సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించింది. దానిని స్వీకరించవద్దని కమ్యూనిస్టు యువకులు శ్రీశ్రీకి సలహా చెప్పారు. ఆయన సరే నన్నాడు. ఆ విధంగా ప్రకటన చేసే కంటే ఢిల్లీ కెళ్ళి అకాడమీ వాళ్ళకు స్వయంగా చెప్పేస్తానన్నాడు. అయితే అది కూడా అవార్డు కనుక అంత నష్టం భరించడం ఎలా అన్నాడు. క్యాష్ అవార్డు ఐదు వేలు తాము కలెక్ట్ చేసి ఇస్తామన్నారు.

కుర్రాళ్ళు ముఖ్యంగా తామే టిక్కెట్టు కొని శ్రీశ్రీని ఢిల్లీకి తీసుకెళ్ళారు. శ్రీశ్రీ అకాడమీ ఆఫీసుకు ఉదయమే వెళ్ళాడు. ఆఫీసులో ముఖ్యమైన వాళ్ళెవరూ లేరు. అవార్డు నా కవసరం లేదు. వదిలేస్తున్నాను అంటూ అక్కడ వాళ్ళ ముందే ప్రకటించాడు. సాయంత్రం రైల్లో తిరిగి వచ్చేశాడు. అవార్డు ప్రదానం చేసే కార్యక్రమానికి శ్రీశ్రీ వెళ్ళలేదు. అవార్డును అకాడమీ వారు మద్రాసుకు పంపించారు. శ్రీశ్రీ క్యాష్ తీసుకొని తక్కిన కాగితాలు తిరిగి పంపేశాడు.

ఈ వివరాలన్నీ ఆ కాలంలో అందరికీ తెలిసినట్టివే. బాగా ప్రచారమైనట్టివే. ఈ ఒక్క ఉదంతాన్ని పరిశీలించి చూస్తే కమ్యూనిజం పట్ల, కమ్యూనిస్టు వాళ్ళ పట్ల శ్రీశ్రీకి ఎటువంటి గౌరవం వుండేదో స్పష్టపడుతుంది కదా ! ఇలాంటి ఉదంతాలు అనేకానేకం.

## చిద్విలాసాలు

సినిమాలకు పాటలు వ్రాయడంలో చాలా వరకు ఇదే పద్ధతి. శ్రీశ్రీ వ్రాసిన పాటలన్నీ ఎక్కువగా జాతీయ గీతాలే. శృంగార రస ప్రధానమైన గీతాలు, ఇతర హరికథలు వంటివి బాగా ప్రజామోదం పొందినట్టివి.

శ్రీశ్రీగారి అరసం, విరసం వాళ్ళతో వున్న సంబంధాలు ఆయన్ను పైకి కమ్యూనిస్టుగా కనబరిచినా, ఆంతరంగికంగా ఆయన పరిపూర్ణమైన పరిపక్వమైన పరమపదసోపానం వంటి మార్గంలో విఘ్నాలన్నిటిని త్రోసి రాజంటూ ఒక రసవత్కవిగా ఎదుగుతూ వచ్చాడు.

ఒకసారి బెంగుళూరు నుంచి ఒక సినిమా కార్యకర్త శ్రీశ్రీని దర్శించి పాటలు వ్రాయమన్నాడు. శ్రీశ్రీ తన షరతు చెప్పాడు. అది పంక్తికి పది రూపాయలు. ఆ వ్యక్తి

ఆలోచించి శృంగారానికి సంబంధించిన పంక్తులు ఒక ఎనభై వ్రాసి పెట్టమన్నాడు. ఎనభై పంక్తులు వ్రాశాడు శ్రీశ్రీ.

ఆ వ్యక్తి ఎనిమిది వందల రూపాయలు తీసి శ్రీశ్రీ చేతిలో పెట్టాడు. ఎనిమిది పంక్తులను ఒక గీత చొప్పున కొట్టి, నాలుగు పంక్తులను పదిపాటలు చేశాడు. ఆ తర్వాత తమ ప్రొడ్యూసర్ శ్రీశ్రీ చేత ఏవో కొన్ని పాటలు రాయించి ఒక వెయ్యి ఇచ్చి రమన్నారని, శ్రీశ్రీ షరతు పెట్టడం వల్ల తను ఎనిమిది వందల రూపాయలకే పది పాటలు రాయించుకో గలిగానని చెప్పి సెలవు తీసుకున్నాడు. ఈ ఉదంతం నేను మద్రాసు ఆంధ్రప్రభలో ఉండగా జరిగినట్టిది.

## లక్ష్మికి అసూయ

సర్వస్వతిని ఆరాధించే వాళ్ళంటే లక్ష్మికి కిట్టదు అనే సామెత నిజమే అని పిస్తుంది. సరస్వతిని ఆరాధించేవాళ్ళు లక్ష్మి పెత్తనాన్ని సాగనివ్వరు. పెత్తనం చేయడానికి లక్ష్మి సర్వసిద్ధమే కాని నిజమైన సారస్వతీయుల పట్ల ఆమె ప్రయత్నం కొనసాగదు. ఇది నా అనుభవంలోని వాస్తవం. శ్రీశ్రీ అనుభవం కూడా ఇదే. నిజమైన కవులు అనేక మంది పరిస్థితి ఇలాంటిదే.

కవుల్లో లక్షాధికార్లు, కోటీశ్వరులు లేకపోయినా, పట్టిందల్లా బంగారం చేసుకొనే వాళ్ళు చాలా మంది వున్నారు. అయితే కళ కళ కోసమే, కవిత్వం కవిత్వం కోసమే, ఆరాధన ఆరాధన కోసమే అనుకొని సరస్వతి సేవ చేసేవాళ్ళు నిజంగా లక్ష్మి అనాదరణకు గురికాక తప్పదు. శ్రీశ్రీ అలాంటివాడు. నాకు లాగే లక్ష్మి పెత్తనాన్ని పట్టించుకున్నవాడు కాదు.

1938లో నేను బి.ఇడి. కాలేజి వదలి సరాసరి మద్రాసు వెళ్ళి ఆంధ్రప్రభలో ఉప సంపాదకుడిగా చేరవలసినవాణ్ణి. రాజమండ్రిలో అప్పటి కాంగ్రెసు నాయకుడు క్రొవ్విడి లింగరాజు గారి అభిమతం అది.

అయితే నేను కొంత ఆలస్యం చేసి మద్రాసు వెళ్ళడం వల్ల నేను చేరవలసిన స్థానంలో శ్రీశ్రీ గారు చేరి వున్నారు. గత్యంతరం లేక నేను ప్రజామిత్ర వార పత్రికలో చేరాను. గూడవల్లి రామబ్రహ్మంగారు మాలపిల్ల సినిమా తీస్తున్న రోజులు అవి.

ఆంధ్రప్రభలో కొంతకాలం పనిచేసి, సంపాదకుడు నార్లవారి సంపాదకీయాలను యమకంపు అంటూ విమర్శించి, అక్కడి నుంచి తప్పుకున్నాడు శ్రీశ్రీ. ఆనందవాణి వంటి కొన్ని పత్రికల ఆఫీసులలో కూర్చుని, వాటికి ఏవో రచనలు వ్రాసి, సిగరెట్టు, కాఫీలతో తృప్తిపడి అలా కాలక్షేపం చేసిన రోజులున్నయ్. అయితే ఆయన పాండిత్యం గొప్పది కనుక, సారస్వత ఆరాధన అద్వితీయం కనుక, శృంగార రసంలో అందె వేసిన చేయి కనుక సినిమాలలో చేరగలిగాడు. తనను మించిన మహాకవి లేడనిపించుకున్నాడు.

ఆయన కమ్యూనిస్టు పార్టీలో చేరడానికి మూడు కారణాలు. ఒకటి ఆయన పేదరికం, రెండు కాంగ్రెసు వారి అలసత్వం, మూడు కమ్యూనిస్టుల చొరవ.

కవులకు పేదరికం సహజమే! పేదగా పుట్టిన కవి ధనవంతుడు కావడానికి ప్రయత్నించడు. ధనం రావచ్చు, లక్ష్మి వరించవచ్చు. కాని శ్రీనాథకవి విషయంలో వలె ధనం ఎంత వచ్చినా ఖర్చయి పోతూనే వుంటుంది. చివరికి మిగిలేది పేదరికమే.

## కళా కార్మికులు

కవి గాని, ఏ కళాకారుడుడైనా గాని, నిరంతరంగా కళారాధన చేస్తూ కూర్చుంటాడు. కళాసేవ తప్ప మరొక పని ముట్టుకోడు. మరి ధనం ఎలా వస్తుంది? ధర్మజ్ఞులైన ధనికులు, ప్రజాపాలకులైన రాజులు కళను పోషించడం అందుకే ! ఏ కళ అయిన పరభృతమే ! ఇతరుల చేత పోషింపబడేదే ! కాగా శ్రీశ్రీ పేదవాడుగా ఉండడంలో అసహజత్వం ఏమీ లేదు. అయితే పోషకు లెవరు అనేది ముఖ్య సమస్య.

శ్రీశ్రీ మహాకవి కనుక కళాసేవ తప్ప మరొక పని చేయడు. ఆయనలోని కళను ఎవరో పోషించవలసి వుంది. ఆ ఎవరో ఎవరు ? ఇది రాచరికాల కాలం కాదు. ప్రజారాజ్యాల కాలం.

మెజారిటీ ప్రజలు కాంగ్రెసును ఎన్నుకున్నారు. అంతా మనవాళ్ళేలే అనేది కాంగ్రెసు తత్త్వం. కాంగ్రెసుకు స్వయం నిర్ణేతలైన కవులు, కళాకారులు తప్ప కాంగ్రెసు నుంచి ప్రత్యేక పోషణ, ప్రత్యేక శ్రద్ధ, ప్రత్యేక ఆదరణ కోరేవారు లేరు.

అంతా జాతీయ వాదులే. అందరూ చేసేది ప్రజాసేవే. ఒకళ్ళ గురించి

మనవాళ్ళు ప్రత్యేకంగా ఎందుకు పట్టించుకోవాలి ? అలా పట్టించుకొనే అవసరం లేదనుకొన్నది కాంగ్రెసు.

ఇక కాంగ్రెసుకు ప్రత్యామ్నాయ శక్తిగా తయారు కావడానికి కృషి చేస్తున్నది కమ్యూనిస్టు పార్టీ. దానికి బల పరిచేవాళ్ళు కావాలి. అనుచరులు కావాలి. సహచరులు కావాలి.

అందువల్ల కవులను, రచయితలను, ఇతర కళాకారులను, మిత్రులను, అభిమానులను, అనుచర వర్గాన్ని ఆకర్షించి కూడగొట్టుకొనే పనిలో మునిగిన కమ్యూనిస్టు పార్టీ అనుచర వర్గంగా షెడ్యూల్డ్ కులాల వాళ్ళు, షెడ్యూల్డ్ తెగల వాళ్ళు, యితర పేద వర్గాల ప్రజలు, కార్మిక వృత్తుల వాళ్ళు సులభంగానే లభించారు.

వాళ్ళను ఉత్సాహ పరిచి, ఆశలు గొల్పి, కూడగట్టి వుంచడానికి సిద్ధాంతాలు వంటబట్టించుకొన్న యువకులను, విద్యావంతులను, కవులను, ఇతర కళాకారులను కమ్యూనిస్టులు ఆకర్షించవలసి వచ్చింది. ఆకర్షించి ఆకట్టుకోవలసి వచ్చింది.

అట్టి ప్రయత్నంలో వాళ్ళకు సులభంగా దొరికినవాడు, పోషణను కోరిన కవితా కళాకారుడు శ్రీశ్రీ. వాళ్ళ అందుబాటులోకి వచ్చాడు. ఆ విధంగా శ్రీశ్రీ కమ్యూనిస్టు సాహిత్యం పరిధిలోకి వచ్చాడు. వాళ్ళు ఆయనకు అన్ని విధాల తోడ్పడగలరు. పోషించారు. ప్రచారం ఇచ్చారు. తమ పార్టీకి ఆస్థాన కవిగా చేసుకొన్నారు.

ప్రజారాజ్యంలో ఏ కవి అయినా, కవితా వస్తువుగా ఏ విషయాన్ని స్వీకరించినా కవిత్వమే వ్రాస్తాడు. కవితా లోకాలలో స్వేచ్ఛగా విహరిస్తాడు. కవిత పార్వతి అయితే కవి పరమేశ్వరుడు. కాళిదాసు వందనం చేసింది అట్టి పార్వతీ పరమేశ్వరులకే.

"జగతః పితరౌ వందే" అన్నాడాయన. అట్టి శక్తి ప్రకృతి పురుష పరమేశ్వరుల శక్తి. దానిని ఎవరూ నియంత్రించలేరు. దాని కదే ఇష్టానువర్తి. కవి కూడా తన కవిత్వాన్ని నియంత్రించలేడు.

కవిత్వం స్వేచ్ఛానువర్తి. ఇష్ట వచ్చినట్లు వస్తుంది. వ్రాయిస్తుంది. విహరిస్తుంది. కవిత్వం తనదైనా, కవి దానిని అనుసరించి మెలగవలసిన వాడే ! ఈ సత్యాన్ని

గ్రహించి కవితా పోషకుడు కవితా రసజ్ఞులు ఏ పార్టీకి చెందిన వారైనా, కమ్యూనిస్టులయినా, కాంగ్రెసు వారైనా, కేవల వ్యక్తిగత ప్రధానలైనా, కవి ఏమి వ్రాసినా దానిని గౌరవించ వలసిందే ! కవిని పోషించవలసిందే !

## కళ కళ కోసమే !

కళ కళ కోసమే
కళ ఆనందం కోసం
అందరికీ సమానంగా ఆనందం కలిగించడం
కళ ముఖ్య లక్షణం
అందరూ అంటే దొంగలూ, దొరలూ కూడా !

కళ మనస్సుకు చెందినట్టిది
దొంగలకూ, దొరలకూ మనస్సుంది
సంసారాలున్నై, పిల్లలున్నారు
సొంత పిల్లల్ని రెండు వర్గాలూ
సమానంగానే ప్రేమిస్తై
ఇష్టమైన పదార్థాలు పెడతై
ఆస్తులు పంచి పెడతై
ఇరు వర్గాలకూ సమానంగా
ఆనందం కలిగించేదే కళ.

కళలకు కులాలు లేవు, వర్గాలు లేవు
పక్షపాతాలు లేవు, స్వపర భేదాలు లేవు
కళలో ఉత్తమ కళ కవిత !

కళ కళ కోసమే, కవిత్వం కవిత్వం కోసమే అనే మనస్తత్వం గల శ్రీశ్రీ, ఆ విధంగా కమ్యూనిస్టు పార్టీ వాడయినాడు. ఆ పార్టీతో చివరి వరకు వుండి పోయాడు, అంతే ! తన స్వేచ్ఛను ఏనాడూ కోల్పోలేదు. తన ఆనందం కోసం కవితలు, గేయాలు వ్రాసుకొన్నాడు. సినిమాలకు వ్రాశాడు.

పత్రికలకు వ్రాశాడు. మహాసభల్లో పాడాడు. తన చుట్టూ చేరిన అభిమాన యువతకు అవసర సాహిత్యాన్ని అందించి అలరించాడు. అది దేశభక్తిగాని, జాతీయవాదం గాని, కమ్యూనిస్టు సూత్రావళిగాని, శృంగారరంగాని, వీరావేశం గాని - ఏదయినా సరే తాను వ్రాసిందే కవిత్వం అని అనుకొని వ్రాశాడు. యువకులను ఆనంద పరిచాడు.

కవిత్వం కవిత్వం కోసం అంటే ప్రజల కోసం కాదా ? తాను వ్రాసు కుంటూ, తన భావాలకు అక్షరరూపం ఇచ్చుకుంటూ ఆనందించే కవి ఉత్తమ మానవుడు కాదు.

తాను తయారుచేసుకొన్న పదార్థాన్ని తాను అనుభవిస్తూ లోకానికంతటికీ పంచిపెట్టి, తృప్తి పరచగలవాడే మహా మనిషి, మహాత్ముడు. మహాకవి. అట్టివాడు శ్రీశ్రీ.

తనకు విశ్వాసం లేని వర్గ సూత్రాలకు కూడా ప్రచారం కల్పించిన శ్రీశ్రీని మొదట్లో నేను తప్పు పట్టేవాణ్ని. యువతీ యువకులను తమ మార్క్సిస్టు భావాలే సర్వ సత్యాలనే భ్రాంతిలో ముంచి వుంచాడు శ్రీశ్రీ. అది తప్పు కాదు అనుకొనే వాణ్ని నేనూ మొదట్లో. తప్పు కాదని, అదే లోకనైజమని, సామాన్య మానవుడు భ్రాంతిలో తప్ప సత్య ప్రకాశనలో బ్రతకలేడని లోకాన్ని పరిశీలించే కొలది నా అనుభవంలోకి వచ్చింది.

చీకట్లో మాత్రమే బ్రతకగల్గిన జీవరాసులుంటవి. అజ్ఞానంలో మాత్రమే బ్రతక గల్గిన జీవి మానవుడు.

అజ్ఞానమే పరిశీలనకు, పరిశోధనకు మార్గ మయింది. వెలుగులోకి రావాలనే తపన, జ్ఞానం సముపార్జించాలనే కాంక్ష ఇతోధిక మవుతూ వచ్చింది. ఇంకా పూర్తిగా వెలుగులోకి రాకపోయినా తానే వెలుగు అనుకొనేటంత తాను ఇంకా దిగ్భ్రాంతిలో వున్నవాడు కూడా మానవుడే. అట్టి మానవ లోకంలో సుఖంగా బ్రతక దలచిన మానవు డెవరైనా సరే అవసరాన్ని చూసుకుంటాడే తప్ప ఆదర్శాన్ని కాదు.

శ్రీశ్రీ విశ్వ మానవుడు, మహాకవి. మానవులు అందరికి వలెనే అతడిది అవసరం. ఆదర్శం కాదు. ఆదర్శం అంటే ఎవరైనా దానికేసి పయనించవచ్చు. అందుకోలేడు. ఆదర్శం అంటే అది. అవసరం అంటే క్రమశిక్షణ ప్రాముఖ్యం గల బ్రతుకు తెరువు. త్రిమూర్తుల దగ్గర నుంచి చీమల దోమల వరకు కూడా బ్రతుకు తెరువులన్నీ ఆదర్శాలను చూపుతూ అవసరాలను తీర్చుకొనే బ్రతుకులే.

ఈ దృష్టితో పరిశీలించి నప్పుడు శ్రీశ్రీ అవసర మర్యాదలను తప్పు పట్టడం కూడదు. శ్రీనాథుడు మొదలైన కవులు పూర్వం నుంచి ఏ చేసారో శ్రీశ్రీ కూడా అదే చేశాడు.

సర్వజ్ఞ నామధేయ అనే పద్యంలో రావుసింగభూపాలుణ్ని పొగిడిన శ్రీనాథ కవిసార్వభౌముడితో, సినిమా రంగానికి చక్కని రస కవితలను వ్రాసి అందజేసిన శ్రీశ్రీని పోల్చడం అతిశయోక్తి అనిపించుకోదు.

సినిమా ప్రొడ్యూసరు కోరిన విధంగా పాట వ్రాయకపోతే అట్టి పాటను మరొకరు వ్రాసే అవకాశం ఉంది. అప్పుడు "మన పొయ్యిలో పిల్లి లేవదు" అన్నారు శ్రీశ్రీ. నిజమే కదా ! ఇదీ అవసరం అంటే.

జాతీయ అవార్డు పొందిన అల్లూరి సీతారామరాజు చిత్రంలోని పాట లాంటిది అసలైన తెలుగు జాతీయ గీతం కాదా !

తెలుగువీర లేవరా

దీక్ష పూని సాగరా

దేశమాత స్వేచ్ఛ కోరి

తిరుగుబాటు చేయరా

అనే పాటను మించిన పాట మరొకటి వున్నదా ! దాని నిండా వున్నట్టివి ప్రగతిశీలమైన జాతీయభావాలే కదా ? దేశంలో స్వేచ్ఛ కోరి తిరుగుబాటు చేయ మనేది పరమ విప్లవం కాదా ? శ్రీశ్రీ విప్లవ కారుడు అనవచ్చు. కమ్యూనిస్టు అనడం వాస్తవం కాదు.

# విప్లవమే ప్రగతి, అభ్యుదయం

*అభి అభ్యుదయం, గతి ప్రగతి*
*ఇవన్నీ ఆది నుంచీ వస్తున్నవే*
*క్రొత్తేమీ లేదు, సహజ స్వతంత్రాలు !*

ప్రపంచంలో ఏ విప్లవమూ ఏదో ఒక పార్టీకో, వ్యక్తికో సంబంధించినట్టిది కాదు. ప్రతి మార్పు విప్లవమే. ప్రతి ఉదయం సుప్రభాతమే. అంధకారం నుంచి అభ్యుదయం అది.

అభ్యుదయ మనేది ప్రతి ఉదయమూ అంధకారం నుంచే పుడుతుంది. అది తిరిగి అంధకారంలోనే అంతరించి పోతుంది. మళ్ళీ మర్నాడు అంధకారం నుంచే పుడుతుంది.

ఈ చక్రభ్రమణ వృత్తి శంఖా వృత్తి కావచ్చు. అంధకారం నుంచి పుట్టి వికసించి ముదిరి విక్రమించి క్రమంగా వాడిపోయి తిరిగి అంధకారంలోనే అంతరించిపోవడం సహజ ప్రవృత్తి. విప్లవం అంటే మార్పు అనుకున్నప్పుడు ప్రతి మార్పు పద్ధతి ఇదే.

అందుకే రష్యా పద్ధతి విప్లవమైనా, చైనా పద్ధతి విప్లవమైనా, కాస్ట్రో పద్ధతి విప్లవమైనా, గాంధీ పద్ధతి విప్లవమైనా, అంబేద్కరు పద్ధతి విప్లవమైనా అన్నీ ఒకటే. భేదా లుంటే అవి ఆయా జాతుల సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించి ఉంటై.

శాంతి క్రాంతి అనేది ఒక జాతి స్వభావం అయితే, నరుకు చంపు అనేది మరొక జాతి సంప్రదాయం. అవి ఆయా జాతుల గుణాలు. మార్పు ఇష్టాను సారంగా వచ్చినా, మరొకరి బెదిరింపు వల్ల వచ్చినా మార్పు మార్పే.

మొదట్లో కొంత కొత్తగా కనిపించినా తరువాత తరువాత అది అలవాటైపోతుంది. కొత్త వింత పాత రోత అనే లోకోక్తి విప్లవానికి వర్తిస్తుంది.

# స్నేహం - నిధులు

ఘర్షణను వర్గ పోరాటం అన్నాడు మార్క్స్. వర్గాలు సహజమే. ప్రకృతి నిండా వున్నవి అవే. ఒక్కొక్క జీవరాశి ఒక్కొక్క వర్గం. జీవరాశుల మధ్య, అంటే వర్గాల మధ్య పోరాటమూ, సంఘర్షణా, పరస్పర హింసా వంటివి సహజమే.

గోజాతి ఒక వర్గం. సింహజాతి మరొక వర్గం. ఆ రెండు వర్గాల మధ్య నిత్య పోరాటమే తప్ప స్నేహం ఉండనే ఉండదు. ఆ రెండు జాతుల మధ్య జాతి సంఘర్షణలే తప్ప సమైక్యత ఉండదు.

సమైక్యత కోసం కమిటీలు వేసుకుని నిధులు మంజూరు చేయించుకొని తెలివైన దొరలు భోగాల ననుభవిస్తూ ఉంటారు.

సమైక్యం సాధ్యం కాదని అందరికి తెలుసు. ప్రయత్నిస్తే సాధ్యమవు తుందేమో అనే ఆశను వ్యక్తం చేస్తారు. ప్రయత్నం కోసం డబ్బు కావాలంటారు. అందువల్ల వర్గ పోరాటాన్ని ప్రచారం చేసినంత మాత్రంచేత మార్క్సు గొప్పవాడు కాదు.

మానవ సమాజాన్ని మార్క్సు వర్గాలుగా విడదీసి పోరాటాలను ప్రోత్సహిస్తే, మన కాంగ్రెసు నాయకుడు ఎన్.జి. రంగా మానవ సమాజంలోని సహజ కర్మ విభాగాలను ఒకే కుటుంబంగా చేసాడు.

మార్క్సు కార్మిక వర్గ ప్రాభవాన్ని ప్రోత్సహిస్తే, రంగా రైతు కూలీ ప్రజారాజ్యం అన్నాడు. నిజానికి మార్క్సిజం కంటే రంగాయిజం గొప్పది.

కర్మ విభాగంలో కనిపించే వర్గాలు నిజంగా అన్నదమ్ముల సంబంధాలు, కుర్రవాళ్ళు పనులు చేస్తారు. వాళ్ళే పెద్ద వాళ్ళయిన తర్వాత పెత్తనాలు చేస్తారు. వాళ్ళే వృద్ధులవుతూ ఉన్నపుడు సలహాలు చెపుతారు. ప్రణాళికలు సృష్టిస్తారు.

ఈ అందరూ ఒకే కుటుంబం వాళ్ళు. వాళ్ళే వ్యవసాయం చేసినా, వివిధ వృత్తులను చేపట్టినా, కర్మాగారాలను నడిపినా, రాజ్యపాలనకు దిగినా, వాళ్ళందరూ అన్నదమ్ములే. ప్రజలే.

అందుకే ఒక వర్గం మీద పోరాడి గెల్చి రెండో వర్గం వాళ్ళు పెత్తనానికి వచ్చే

మార్క్సిజం కంటే, రైతుకూలీ ప్రజలంతా ఒకే రాజ్యపు పౌరులు అనే రంగాయిజం గొప్పదంటే అందులో అనౌచిత్య మేమీ లేదు.

అందుకే విప్లవం సహజమని, అది ఒక స్థితి నుంచి పుడుతుందని, అట్టి స్థితి పాతదై పోయినపుడు కొత్త మార్పు కోసం ఆరాట పడుతుందని, కనుక విప్లవం నుంచే ప్రగతి, అభ్యుదయం, ఇతోధిక శ్రేయస్సు, సుఖశాంతులు కలుగుతాయని నేను చెపుతున్నాను.

పరిశీలించే వాళ్ళకు ఈ పరిక్రమం సరైనదే అనిపిస్తుంది.

## మోసాలు, అవసరాలు

భారతదేశ చరిత్ర పురాణాలతో మొదలైం దన్నప్పుడు, ప్రపంచానికే వేదాలు తొలి వాఙ్మయం అనుకొన్నప్పుడు మనకు సర్వత్రా ఒకే ఒక వాస్తవం కనిపిస్తుంది. అది మోసం.

మన పురాణ సాహిత్యం దేవాసుర యుద్ధాలతో మొదలవుతుంది. దేవతలు, రాక్షసులు దాయాదులే అయినప్పటికి, ఒకే తండ్రి సంతానం అయినప్పటికి అధికారం కోసం నిత్యం పోరాడుకుంటూ వుండే వాళ్ళు, ఆ ఇరువర్గాలకు నాయకులు, వాళ్ళ ముఠాలు.

ఇంద్రుడు దేవతలకు రాజైతే రాక్షసులకు రాజులు చాలా మంది వుండే వాళ్ళు. ఒక్కొక్క కాలంలో, ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్కరుండే వారు. పోరాటం అనగానే కొన్ని నియమాలకు కట్టుబడి ఉంటుందనుకొన్నా, మొత్తం మీద ఏ నియమాలకు కట్టుబడకుండా సాగిపోతూ అక్రమ మార్గాలలోనే విజయం సాధిస్తుంది.

మోసాలు లేకుండా యుద్ధాలుండవు. అక్రమ మార్గం ప్రతీదీ మోసమే. మొదట యుద్ధాలుగా పేర్కొనబడే రామాయణం తర్వాత భారత సంగ్రామాలలో కూడా అక్రమ పద్ధతులతో విజయం సాధించారు.

రాముడు, భీముడు, ధర్మరాజు మొదలగు వాళ్ళు ఈ దృష్టితో చూచినప్పుడు మోసగాళ్ళే. మోసం చెయ్యకుండా ఎవడూ అధికారంలోకి రాలేదు. యుద్ధం గెలవలేదు. మహారాజు కాలేదు.

యుద్ధం గెలవలేదు. సుఖ భోగా లనుభవించ లేదు.

ఈ మోసం అనేది ఒక్క రాజకీయ రంగమే కాక, వాణిజ్యం, సాహిత్యం, సంస్కృతి మొదలగు అన్ని రంగాలకు చెందినట్టిది. అన్ని రంగాలకు చెందిన గొప్ప వాళ్ళందరూ, మహామహులందరూ మోసగాళ్ళే.

అయితే ప్రజల దృష్టిలో, ప్రజల భాషలో మోసం అనేది నికృష్ట స్థానంలో వుంది. ఆ మాటకు ఏ మాత్రమూ గౌరవం లేదు. ధర్మరాజు అబద్ధమాడడు. మోసం చేశాడంటే ఎందుకో ఎబ్బెట్టుగా వుంది. అందుకే మోసం అనే మాటకు అవసరం అనే మాటను వాడుతున్నాను. మనం మోసా లనుకొనేవన్నీ కేవలం అవసరాలు మాత్రమే అంటున్నాను.

ఎప్పటి కెయ్యది ప్రస్తుత మప్పటికా మాట మాటాడ మన్నది విదురనీతి. వారిజాక్షు లందు, వైవాహికము లందు, ప్రాణ విత్త మానభంగ మందు బొంకవచ్చు, అఘము పొంద దన్నది శుక్రనీతి. బొంకవచ్చు, అసత్యమాడవచ్చు, ఎలాంటి పాపం చుట్టుకోదు అంటాడు గురువు శుక్రుడు.

చరిత్రలో సమాజం నిండా గొప్ప గొప్ప వాళ్ళందరూ నీతి నియమా లన్నింటిని వదిలేసి విజయం సాధించి నప్పుడు అది మోసం అనం; అవసరం అంటున్నాం. కనుకనే అవసరాలకు అనుగుణంగా ప్రవర్తిస్తూ, జీవితాన్ని కొనసాగిస్తూ, అద్భుతమైన కవితా సౌరభాలను లోకాలకు వెదజల్లిన శ్రీశ్రీ తీర్చుకొన్నవన్నీ అవసరాలే అంటున్నాను.

కమ్యూనిస్టు పార్టీలో చేరడం ఒక అవసరం. సినిమాలకు పాటలు వ్రాయడం మరొక అవసరం. పత్రికలలో కవితలు ప్రకటించడం ఇంకొక అవసరం.

రష్యాలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలో వున్నప్పుడు అక్కడేం జరుగుతుందో ఎవరికీ తెలిసేది కాదు. భారత కమ్యూనిస్టు పార్టీ తన కొక వేదిక, సాహిత్యం, ప్రచారం అవసరం కనుక రష్యాలో ప్రజా జీవితం స్వర్గ తుల్య మంటూ ప్రచారం చేసింది. శ్రీశ్రీ వంటి మహాకవి చేత గాంఢ్రించు రష్యా అనిపించారు.

అలా అనడం కమ్యూనిస్టు పార్టీకి ఒక విధమైన అవసరం. శ్రీశ్రీకి మరొక విధమైన అవసరం. మరి అక్కడ కమ్యూనిస్టు పార్టీ శిథిలమై పోయిన తరువాత

ఇప్పుడు శ్రీశ్రీ ఏమనేవాడో తెలియదు. పార్టీ మాత్రం మౌనం వహించింది - శ్రీశ్రీ వీణ లాగా.

## ఈ వ్యాసం వ్రాయడంలో నా ఉద్దేశం

అసలు శ్రీశ్రీ గురించి వ్రాయాలని నీకెందుకు అనిపించింది? వ్రాయాలనుకొన్నప్పుడు నీకు తెలిసిన కవులు ఇంకా ఎంత మంది లేరు, ఒక్క శ్రీశ్రీని ఎందుకు పట్టుకున్నావు లాంటి ప్రశ్నలు నా చుట్టూ వుండే సన్నిహితులు అందరూ తెచ్చారు.

జవాబు చెప్పడం కష్టమేమీ కాదు. రచన కోసం ఏ వస్తువు తీసుకున్నా ఆ వస్తువే ఎందుకు తీసుకున్నావు అనే ప్రశ్న రావడం సహజం. అయితే రచనకు శ్రీశ్రీ లాంటి కథన వస్తువు, క్లిష్ట వస్తువు, వివాదాస్పద వస్తువు మరొకటి లేదంటే కాదనే వారెవరూ వుండరు.

శ్రీశ్రీ స్వచ్ఛమైన జాతీయవాది. అతడు స్వేచ్ఛగా ఇష్టం వచ్చినట్టు కవితాగమనంలో విహరిస్తూ ఉంటే 'పద్మభూషణ' దాటి 'భారతరత్న' వరకు వెళ్ళే వాడనిపిస్తుంది నాకు.

కష్టాలన్నీ అనుభవించాడాయన. పేదరికం లోతులు చూశాడు. ఆంతరంగికంగా ఆనందం అంచులు తాకాడు. గట్టెక్కలేకపోయాడు. గట్టెక్కలేక పోవడానికి కారణం కమ్యూనిస్టు పార్టీ.

పేదరికం లోతు లోతుల్లో బ్రతుకుతున్న వారు అసంఖ్యాకంగా ఉన్నారు. కవులలో కూడా ఉన్నారు. ఏ గుర్తింపు ఆశించని కళాకారులున్నారు. తమ పరిధుల్లో తమ తమ కళలను పోషించుకుంటూ అభిమానమంటూ బ్రతికేస్తున్నారు వాళ్ళు.

పెద్ద బ్రహ్మాండ మయిన చిచ్చుబుడ్డి అయినా ఎంతగా కాలి వెలుగిచ్చే దయినా ఆకాశం లోకి దూసుకు పోలేదు కదా. శ్రీశ్రీ వంటి కవులు తారాజువ్వలు. ఉత్తమ తారాజువ్వ ఉవ్వెత్తున ఎగసి ఉజ్వలంగా పేలగలదు. శ్రీశ్రీ అలాంటివాడు. అంతటి వాణ్ణి కేవలం తమ పార్టీకి మతాబాను చేసుకొన్నది కమ్యూనిస్టుపార్టీ.

కవికి భారతరత్న ఇస్తారా అంటే, ఆయన జాతీయ కవిగానే ఉండిపోతే ఇచ్చేవాళ్ళే. శ్రీశ్రీలోని ఆత్మీయ పరమాణు శక్తి అంతటి ఉద్భోధక మైనట్టిది.

ఇక ఈ గ్రంథం వ్రాయడంలో నా ముఖ్యోద్దేశం శ్రీశ్రీ కమ్యూనిస్టు కాదని చెప్పడం. కమ్యూనిస్టు యువతను, పార్టీని ఒక ఇంద్రజాలంలో భ్రాంతి వలయాకారంలో వుంచాడాయన.

అట్టి భ్రాంతి వలయాకారంలో పడి, ఆత్మస్తుతి చేసుకుంటూ బ్రతికేస్తున్నారు. చాలమంది యువకులు, బడుగు వర్గాల నాయకులు.

అట్టి భ్రాంతిని తొలగించి ప్రజలను తిరిగి యథాస్థితి జాతీయ పౌరులుగా మార్చడం నాధర్మంగా భావించాను. ఈ విధంగా నా విధిని నిర్వహించాను.

శ్రీశ్రీని, ఘంటసాలను సాహిత్య, సంగీత రంగాలలో పైడ్ పైపర్‌లుగా పోల్చి వ్రాశాను పూర్వం. సాహిత్యంలో శ్రీశ్రీ గొప్ప ప్రతిభావంతుడు. సమకాలీనులు, యువతరం వాళ్ళు ఆయనలా వ్రాస్తేనే కవిత్వమని నమ్మి అలానే వ్రాయడం ప్రారంభించి కవిత్వానికి పదును లేకుండా చేసారు.

అదే నూరడం. కత్తి అరిగే వరకు, రాయి కరిగే వరకు నూరి నూరి రెంటిని నాశనం చేసి పారేశాడు. చివరకు శ్రీశ్రీ వ్రాసినట్టు వ్రాస్తేనే కవిత్వం, ఘంటసాల లాగా పాడితేనే సంగీతం అనే స్థితికి వచ్చారు. అందువల్లనే ఆ విమర్శ చేశాను నేను.

శ్రీశ్రీ వ్రాసినట్లే వ్రాస్తే ఇక అందులో ప్రగతి ఏముంటుంది? అభ్యుదయ మేముంటుంది ?

శ్రీశ్రీ ఎక్కడ ఆగాడో, అక్కడ మొదలు పెట్టి ముందుకు సాగవలసి వుంది. ఆ ప్రయత్నం లేక పోవడం అభ్యుదయ నిరోధనం. ఆ నిరోధనత్వాన్ని తొలగించి, అవరోధాలను సడలించి శ్రీశ్రీ నుంచి కవిత్వాన్ని పురోగమింప చేయడం నా లక్ష్యం. నా లక్ష్యం ఎంతవరకు నెరవేరిందో ఈ రచనను చదివిన వాళ్ళు చెప్పాలి.

కవితకు వస్తువుగా మారే అర్హత సృష్టిలోని పిపీలకాది క్రమ పర్యంతం ప్రతి అణువుకు ఉంది. కవితకు ఏదీ వర్జ్యం కాదని పూర్వం నుంచి మహా మేధావులు చెపుతూనే వచ్చారు.

కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ అంటూ శ్రీశ్రీ చెపితే కాని అర్థం కానంతటి తెలివితక్కువ వాళ్ళుగా యువతరం తయారయ్యా రంటే యిక ఆ విద్యకు అంతం ఎక్కడ ? అందుకే ఈ పునరుజ్జీవన కార్యక్రమానికి పూనుకొన్నాను.

అరస, విరస, దిగంబర సాహిత్యాలతో పాటు దళిత సాహిత్యం కూడా ఈ మధ్య అందులో చేరడం వల్ల ఇక ఈ అంధకారానికి అంతం లేదేమో అనిపించి ఈ అభ్యుదయ కృషికి పూనుకోడం జరిగింది.

ఆగండి. అంధకారాన్ని కొనసాగనివ్వకండి. అజ్ఞానానికి భరతవాక్యం పలకండి. తెల్లవారిపోయింది. ప్రపంచమంతా సుప్రభాతం పాడుతుంది. గొంతు కలపండి. కమ్యూనిజం కాదు, ఏ జాతి కాజాతి జాతీయ సోషలిస్టు సమాజం కావాలి.

విద్యలోను, పోషణలోను, అవకాశాలలోను, అభ్యుదయంలోనూ పరస్పర సహకారంతో ముందుకు సాగండి. లేమి ఉన్న దనుకోవద్దు. సుఖశాంతులు యజమానుల కెంతో కర్షకులకూ అంతే. కార్మికులకూ అంతే. అందరూ తినేది అన్నమే. చేసేది సంసారమే. ఇందులో పూర్ణ సుఖాలు అందరికి లభించాలి. లేవండి. రండి. సాధించండి. సుఖపడండి.

కమ్యూనిస్టు పార్టీకి అంకితమయితే, ఆ పార్టీకే కాక శ్రీశ్రీకి కూడా లాభదాయకమే, సాహిత్యరంగంలో ఒక ఏకైక కవిగా ప్రఖ్యాతి కొస్తాడు. కమ్యూనిస్టులు తమ సాధన సంపత్తి ద్వారా బ్రహ్మాండమైన ప్రచారం ఇస్తారు. శ్రీశ్రీకి బ్రహ్మరథం పడతారు. ఈ సందిగ్ధ స్థితిలో శ్రీశ్రీ కమ్యూనిస్టు పార్టీని వరించాడు.

అదొక సంధియుగం. తాను ఒక పార్టీకి చెంది, ఒక సిద్ధాంతానికి కట్టుబడి, విశ్వజనీనత్వాన్ని పోగొట్టు కోవడమా అనేది శ్రీశ్రీని బాధించిన ఆలోచన. అప్పుడు వ్రాసిందే బహుశా 'ఏమని పాడెదనో ఈ వేళ' అనే పాట.

పంజరం పిలుస్తున్నది. మామూలు పంజరం కాదు. పసిడి తీగల పంజరం. అందులో చేరితే తనకు అన్ని విధాల రక్షణ ఏర్పడుతుంది. చిలుక తానే రాణి అవుతుంది. అయితే స్వేచ్ఛ పోతుంది.

స్వేచ్ఛ విలువ ఏమిటి ? పంజరంలో చేరకపోతే తన గతి ఏమవుతుంది? బయటిది భయంకరమైన పరిస్థితి. ఎన్నో పిల్లులు, నక్కలు, కుక్కలు విచ్చల విడిగా తిరుగుతున్నయ్.

బాగా ఆలోచించిన శ్రీశ్రీ పంజరాన్ని ఎన్నుకొన్నాడు. తన మానసవీణ మౌనంగా నిద్రపోతోంది. సమయానికి దాని సలహా లభించలేదు.

ఇక్కడొక చిన్న వివరణ.

మనస్సును వీణ అన్నాడు శ్రీశ్రీ. మరొక చోట హృదయ వీణ అన్నాడు. మనస్సు వేరు. హృదయం వేరు. మనస్సు వీణ ఎన్నటికి కాదు. హృదయమే వీణ. మనం ఈ తేడా గుర్తించ వలసి వుంది. హృదయ విపంచి అన్నాడాయన.

మానసవీణ అన్నాడా పాటలోనే. వీణ నిదుర పోతున్నపుడు కలత కలలు రావు. కలత నిదురలో కలలు రావు. జాగ్రత, స్వప్న, సుషుప్తి - ఈ మూడూ అవస్థలు. జాగ్రత్ స్వప్నాలు రెండూ నిద్రావస్థ లోవే. అంతవరకు శ్రీశ్రీ చేస్తూ వచ్చిన ఊహలు ఒక్క రూపం ధరించేలా కనిపించలేదు. ఎన్నో ఆలోచనలు. ఒక్కటీ ఫలించేటట్లు లేవు. అవన్నీ గాలిమేడల్లా కూలిపోయి, బయలు అంతా నిరాశ అలముకొన్న క్షణంలో పంజరమే క్షేమం అనుకోవడం సహజం, అలా అనుకొని పంజరంలో ప్రవేశించిన చిలుక శ్రీశ్రీ.

అక్కడ నుంచి ఆయన పంజరం యజమానులు ఆడమన్నట్టల్లా ఆడాడు. పాడమన్నట్టల్లా పాడాడు. వాళ్ళు కూడా విశేషమైన ప్రచారం ఆయనకు చేసి పెట్టారు. అరసంలో కొంతకాలం, విరసంలో కొంతకాలం కాలక్షేపం చేశాడు శ్రీశ్రీ. మార్కిస్ట్ భావాలను తీసుకొని పాటలుగా కూర్చాడు.

తాను సహజంగా భాషావేత్త కాబట్టి ప్రజల భాష నుంచి అందమైన మాటలను, మాటల మూటలను సేకరించి పేద కార్మికుల బాధలను ప్రజల ముందు పెట్టాడు. ఆ రంగంలో గొప్పకవి అనిపించుకొన్నాడు. విశ్వతోముఖమైన ఆయన ప్రతిభ ఆ విధంగా ఏక లక్షితమైంది.

అయితే ఆయనలోని అనువంశిక సారస్వతం ఆయనకు ప్రశాంతి నివ్వలేకపోయింది.

లోకాతీతంగా విను వీధులలో విహరించవలసిన తాను ఇలా ఏక పక్షంగా పంజరంలో ఇరుక్కు పోవడం ధర్మమా అనే మీమాంస మొదలైంది. పంజరం నుంచి అప్పుడప్పుడు బయటపడే అవకాశాన్ని బయట సినిమాలు చూపాయి. అప్పుడు వ్రాసిన పాట 'పాడవేల రాధికా' అనేది. సినిమాల కోసం బయట పడ్డప్పుడల్లా ఆయన వ్రాసిన పాటలే ఉత్తమ మానవత్వాన్ని పరిమళింపచేశాయి.

గోపాలుడు నిను వలచి
నీ పాటను మది తలచి
ఏ మూలనొ పొంచి పొంచి
వినుచున్నాడని ఎంచి

అనేది లోకోన్నతమైన భావనా స్వర్గంలో అద్వితీయంగా వికసించి పరిమళించిన పారిజాతం. దానిని మించిన కవిత్వం ఆధునిక కాలంలో లేదు. కవితలో వ్యంగ్య వైభవం, బ్రాహ్మీరూప ధ్వని ఎంతో చక్కగా హృదయాల మీదికి ప్రసరింప జేసిన పాట మరొకటి లేదని చెప్పవచ్చు. ఆ పాటలోని తరువాత చరణం.

వేణుగాన లోలుడు నీ
వీణామృదు రవము విని
ప్రియమారగ నిను చేరగ
దయ చేసెడి శుభవేళ

ఈ పాటను మామూలు పాటగా చేసి పారేసింది. బహుశా సినిమాలోని సన్నివేశాల మూలంగా డైరెక్టరు కోరికపై వ్రాసి వుంటాడు శ్రీశ్రీ దాన్ని. అందులో "దయచేసెడి" అనే పద ప్రయోగం పాటలోని భావానికి అతకలేదు.

'దయచేసి' అనేది గౌరవ వచనం, పెద్దవాళ్ళు రావడానికి పోవడానికి కూడా ఆ పదం వాడబడుతుంది. 'దయచెయ్యండి' అంటే 'రండి' అని, 'ఇక వెళ్ళండి' అని రెండు విధాల అర్థాలు వున్నయ్.

శ్రీశ్రీ వ్రాసిన గేయాల్లో అనేకం ఉత్తమ గేయాలు. 'సీతారామరాజు' లోని

తెలుగువీర లేవరా
దీక్షబూని సాగరా

వంటి జాతీయ గీతాలు ఆయన పంజరం నుండి బయటకు వచ్చినపుడు వ్రాసినవి. జాతీయ ఉత్తమ గీతాలు, ఉత్తమ పురస్కారాలు కూడా అందుకున్న గేయాలవి.

# మార్క్సిజం

మార్క్సిజం అంటే ఏమిటి ?

మార్క్సు అనే పేరు గల మేధావి ప్రతిపాదించిన సిద్ధాంతం. ఏమిటా సిద్ధాంతం?

ప్రపంచంలోని  మానవు లందరికీ ఆర్థిక ప్రతిపత్తి సమానంగా వుండా లనడం. అది ఎలా ఏర్పడుతుంది ?

కార్మికు లందరూ ఏకమై యజమానుల మీద పోరాడి గెలిచి రాజ్యాధినేత లయితే, సమానత్వం అప్పుడు ఏర్పడుతుంది. రాజ్యాధికారం ధనికుల, యజ మానుల చేతుల్లో వుంటే సమానత్వం ఏర్పడదు. వాళ్ళు పేదలను / కార్మికులను తమతో సమాన స్థాయికి ఎదగనివ్వరు.

పై వాళ్ళు కింద వాళ్ళను ఎదగ నివ్వరు. కింద వాళ్ళు తాము ఎదుగుతూ పై వాళ్ళను కూడా తమతో పాటు ఎదగనిస్తారు. పై వాళ్ళకు కింద వాళ్ళకు మనస్తత్వంలో ఉన్న తేడా ఇది.

అందుచేత అధికారం కింద వాళ్ళ చేతిలో వుంటే తప్ప ప్రపంచ మానవులలో సమానత్వం ఏర్పడదు కనుక, అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడానికి కిందవాళ్ళు పోరాడవలసి వున్నదని మార్క్సు అంటాడు.

ఇది సమాజ మానవులందరూ ఆర్థికంగా సమానంగా వుండాలి అనే సమ సమాజవాదం కనుక మార్క్సిజాన్ని కమ్యూనిజం అని కూడా అన్నారు. సమాజవాదం, సాంఘికవాదం అంటూ రకరకాల పేర్లతో పిలుస్తున్నారు.

కమ్యూనిటీకి సంబంధించింది కనుక 'కమ్యూనిజం' అని, సొసైటీకి సంబంధించినది కనుక 'సోషలిజం' అని అంటున్నారు. ఎవరు ఎలా పిలిచినా మార్క్సిజం అంటే మానవులందరూ ఆర్థికంగా సమాన స్థాయిలో వుండడం.

అయితే మార్కెట్టులో గిరాకీని బట్టి దాని విలువ పది రూపాయలు కావచ్చు. వంద రూపాయలు కూడా కావచ్చు.

కార్మికుడికి చెల్లించేది తమ ఉద్దేశంలో విలువను బట్టే. ఒక వస్తువు ఉత్పత్తి జరిగినపుడు దానికి కార్మికుడికి ముట్టేది. నాలుగణాలు కావచ్చు. గిరాకీని బట్టి యజమానికి వచ్చేది వంద రూపాయలు కావచ్చు. ఈ వంద రూపాయలలో కార్మికుడు తనకు భాగం కావాలంటే ఎలా ? యజమాని లాభం స్థిరమైనది కాదు కదా !

అందువల్ల ఉత్పత్తి సాధనాలే కార్మికుడి చేతిలో ఉంటే ఆ లాభనష్టాల గొడవ లేవో వాళ్ళే స్వయంగా పడవచ్చు కదా అనేది మార్క్సు ఉద్దేశం. అందుకే ఉత్పత్తి సాధనాల మీద అధికారాన్ని కార్మికులు తమ చేతుల్లోకి తీసుకోవా లంటాడు ఆయన.

అందుకు పోరాటం తప్పదు కదా. యజమానులు అంత సులభంగా తమ అధికారాన్ని వదులుకోరు కదా. కనుకనే ఈ రెండు వర్గాల మధ్య నిరంతరంగా పోరాటం సాగుతూనే ఉంటుంది. దానినే వర్గ పోరాటం అన్నారు.

ఏ సాధన సంపత్తి లేని కార్మిక వర్గం, అన్ని విధాల సాధన సంపత్తితో పాటు రాజ్యాధికారం కూడా కల యజమాని వర్గంతో పోరాడట మంటే మాటలా?

## కార్మిక విజయాలు కాదు

ఒక రష్యాలోనో, చైనాలోనో కమ్యూనిస్టు పోరాటం విజయవంతమైనట్టు కనిపించవచ్చు. అటువంటి చోట్ల విజయం వలె కనిపించే దంతా నిజం కాదు.

యుక్తులతో, కుయుక్తులతో, అనుబంధాలతో, ఆశ్రయింపులతో, సైనిక సహాయంతో నిజమైన కార్మికులకు, రైతులకు, కూలీలకు, పేదలకు సంబంధం లేనందుకే, ఆయా నాయకులు వ్యక్తిగతంగా సంపాదించిన విజయాలవి. వాటిని కమ్యూనిస్టు విజయాలనే కంటే నాయక విజయాలనో, కుహనా విజయాలనో అనవచ్చు.

నిజానికి రష్యాలో కమ్యూనిస్టు విజయంగా చెప్పబడింది లెనిన్ విజయం. లెనిన్ సాధించిన సైనిక విజయం. అక్కడ రైతులు, కూలీలు, ప్రజలు కేవలం ప్రేక్షకులు మాత్రమే ఆ తర్వాత దాని సంగతి ఏమైపోయిందో అందరికీ తెలిసిందే.

# డబ్బే దైవం

సమానత్వం అంటే ఒక్క ఆర్థిక రంగంలోనే. ఏ కాలంలో అయినా ఏ దేశంలో అయినా మానవ జీవితాన్ని నడిపేది ధనమే. డబ్బుంటే కొండ మీద కోతి నయినా దింపవచ్చు. కోతే కాదు దేవుడు కూడా దిగి వస్తాడు. నిజానికి డబ్బే దేవుడు. డబ్బు లేకపోతే ఏమీ లేదు. అందువల్ల అందరకూ డబ్బు సమానంగా వుంటే మానవ జీవితం సుఖంగా గడిచి పోతుందని మార్క్సు ఉద్దేశం. ఒక్క మార్క్సే కాదు ఆలోచించగల ప్రతి మానవుడి ఉద్దేశం యిదే.

ఉద్దేశం మంచిదే ఆలోచన బాగానే ఉంది. అయితే అది అమలు జరగడం ఎలా ?

అమలు జరగడానికి మార్క్సు చెప్పిన పద్ధతిలో లోపం వుంది. అందుకే ఒకటి రెండు చోట్ల తప్ప ప్రపంచంలో విజయవంతం కాలేదు. ఆ ఒకటి రెండు చోట్లయినా అది కమ్యూనిజం పేరుతో ఉన్నదే తప్ప నిజంగా అది కమ్యూనిజం కాదు. భారత్‌లో అసలే కాదు.

# వస్తువు విలువ - యజమాని

వస్తువుకి విలువను సృష్టించేవాడు కార్మికుడు అంటాడు మార్క్సు. అది పూర్తి నిజం కాదు. యజమాని చెప్పే పనిని చేసేవాడు కార్మికుడు. కార్మికుడు స్వంతంగా ఏ పనీ చేయడు. దేనినీ సృష్టించడు. వస్తువుకు విలువలు వున్నాయంటే, అవి పెట్టుబడి మీద, గిరాకీ మీద ఆధారపడి ఉంటై.

గిరాకీని సృష్టించేది, వస్తువు విలువను శాసించేది యజమాని యోచన. కార్మికుడు సృష్టించేది వస్తువును మాత్రమే. వస్తువుకు విలువ ఇచ్చేది యజమాని యోచన.

కార్మికుడు సృష్టించిన వస్తువుకు యజమాని దృష్టిలో ఒక విలువ వుంటుంది. దానిని బట్టి కార్మికుడి శ్రమకు మూల్యం చెల్లిస్తాడు. మార్కెట్టులో ఆ వస్తువు విలువ గిరాకీని బట్టి వుంటుంది. యజమాని దృష్టిలో ఆ వస్తువు విలువ ఒక్క రూపాయి

అభ్యుదయ మనేది సంఘర్షణ ద్వారానే జరుగుతుందనేది సహజ సిద్ధాంతం. చలనంలో సంఘర్షణ వుంది. రాపిడి వుంది. సూర్యోదయం చీకట్లను చీల్చుకొని వస్తుంది. ప్రతి మొక్క భూమిని చీల్చుకొని వచ్చేదే. ప్రసవంలో వేదన ఉంది. ప్రపంచంలోకి జీవి రాకపోకల దారులు ఇరుకైనవి. అందువల్ల ఆ రాపిడి. దాని వల్ల వేదన, బాధ. అంటే ఘర్షణ లేకుండా సృష్టి జరగదన్నమాట.

అభ్యుదయానికి కూడా, మానవ సమతా సాధనకు కూడా ఘర్షణ తప్పదు. దానిని వర్గ పోరాటంగా రూపొందించి ప్రతిపాదించడం మార్క్స్ చేసిన పొరబాటు.

వ్యవసాయ కూలీలు సంఘటితులు కారు. సంఘటితులయ్యే అవకాశం కూడా వ్యవసాయరంగంలో లేదు. ఫ్యాక్టరీ కూలీలు సంఘటితులు అయినా కట్టుదిట్ట మయిన కులాలుగా సంఘ నిర్మాణం జరిగివున్న హైందవ సమాజంలో ఈ వర్గ పద్ధతి పని చెయ్యదు.

ప్రతి కులంలోను కార్మికులున్నారు. ప్రతి కులంలోను యజమాను లున్నారు. కులాలను అధిగమించి యజమానులంతా ఒకటి కావడం, కార్మికులంతా ఒకటి కావడం జరగని పని. ఒక కులంలోని కార్మికులు సమ్మె కావాలంటే మరొక కులంలోని కార్మికులు వ్యతిరేకిస్తారు. పరిస్థితుల ప్రభావం కంటే ప్రతి మనిషికి కులానుబంధ ప్రభావం ఎక్కువ.

మరో నిజం ఏమిటంటే యజమాని వర్గాన్ని ప్రభుత్వం బలపరుస్తూ వుండడం వల్ల తెలివితేటలతో పైకి వచ్చిన కార్మికుడు యజమానిగా మారి ఆ వర్గ లక్షణాలను ప్రదర్శించడం సామాన్యవిషయం. ఇటువంటి అనేక కారణాల వల్ల మార్క్స్ యొక్క వర్గ భావన, పోరాట భావన విఫలం కావడం జరిగింది.

## తాజ్‌మహల్ నిర్మాణం - ప్రేమికుడైన మహారాజు

తాజ్ మహల్ గురించిన కవితలో అందరూ దాని గొప్పతనాన్ని గురించి పొగుడుతూ ఉంటారు. అది కాదు ముఖ్యం, దాని నిర్మాణంలో రాళ్ళెత్తిన కూలీలెవ్వరు

అంటూ ప్రశ్నిస్తాడు శ్రీశ్రీ. ఇది ఆయన మనస్ఫూర్తిగా వ్రాసిన కవితేనా అనిపిస్తుంది నాకు. కాదేమో అనిపిస్తుంది.

ఎందుకంటే రాళ్ళు మోసే కూలీలు వేలు లక్షల్లో వుండొచ్చు. తాజ్‌మహల్‌ను కాదు కదా ఓ చిన్న వంతెనను కట్టగలరా ? కూలీల వల్ల ఏమీ జరగదని శ్రీశ్రీకి తెలియదా ?

ఏదైనా నిర్మాణం జరగాలంటే దానిని గురించిన ఆలోచన ప్రధానం. అట్టి ఆలోచన మేధావికో, విజ్ఞానికో, ప్రేమికుడికో వచ్చే టటువంటిది.

విజ్ఞాని అయితే ప్రజా ప్రయోజనకరమైన ప్రాజెక్టు నిర్మిస్తాడు. ప్రేమికుడో, కవో అయితే సుందరమైన కావ్యాలు వ్రాస్తాడు, శిల్పాలు చెక్కుతాడు. శిల్పారామాలు నిర్మిస్తాడు.

తాజ్‌మహల్ భావన ఒక ప్రేమికుడికి వచ్చినట్టిది. ఆయన మహారాజు కనుక దానికొక రూపాన్నివ్వగలిగాడు. ఇంజనీర్లు , శిల్పులు, కూలీలు వంటివారి సహాయం పొందగలిగాడు. కొంచెం ఇస్తే కూలీలు వస్తారు. మరి కొంచెం ఇస్తే ఇంజనీర్లు వస్తారు.

ఎంతోమంది సహాయం పొంది తన మనసులోని అందాలన్నీ దానిలో నింపి నిర్మించిన తాజ్‌మహల్ ఒకే ఒక ప్రేమికుడి భావన. దాన్ని నిర్మించింది షాజహాన్ చక్రవర్తి. ప్రేమించిన భార్య సమాధి ఆ విధంగా తీర్చిదిద్దాడు.

ఇంజనీర్లు, శిల్పులు, కూలీలు నిమిత్త మాత్రులు. జీతాలు తీసుకొని పని చేసిన వాళ్ళే. వాళ్ళ ప్రాధాన్యం ఏమీ లేదు.

పతితులార
భ్రష్టులార !
బాధాసర్ప ద్రష్టులార
ఏడవకం డేడవకండి

వంటి మాటలు శ్రీశ్రీ ఎన్నో చోట్ల వాడారు. ఆ మాటలు, ఆ ఓదార్పులు, ఆ సానుభూతులు శ్రీశ్రీ స్వంతం కాదు. కమ్యూనిస్టుల స్వంతమూ కాదు. అవి అందరూ

వాడుతున్న మాటలే. పేదల పట్ల, బాధితుల పట్ల అందరూ చూపుతున్న సాను భూతి వాక్యాలే. ఆ మాటలు వాడడంలో శ్రీశ్రీ ప్రత్యేకత ఏమీ లేదు.

నిజానికి కార్మికులంతా తమకు జరిగిన, జరుగుతున్న అన్యాయాలకు బాధపడుతున్నా రనడం కూడా నిజం కాదు. అందరూ తింటున్నట్లే తామూ తింటున్నారు. అందరి కంటే ఎక్కువగా కూడా సుఖభోగా లనుభవిస్తున్నారు. రేపటి సంగ తేమిటనే బెంగ లేదు. సుఖశాంతులు నిశ్చింతగా అనుభవిస్తున్నారు. నిజానికి కార్మికులలో వుండే నిశ్చింత, ప్రశాంతత, సుఖనిద్ర యజమానులలోను, ధనవంతులలోను, అధికారులలోనూ కూడా ఉండదు.

మార్క్సు చేసిన ప్రచారం వల్ల కార్మికులంతా, పేదలంతా బాధపడు తున్నారనేది ఇతరులనుకోవడమే తప్ప అసలు వాళ్ళకు అట్టి చింతలేమి ఉండవు. అందుకే ఆ ఉద్యమం విఫల మయింది. శ్రీశ్రీ తన సాహితీ సరస్వతిని రాధారూపంలో వేడుకోవడం జరిగింది.

మహా ప్రస్థానంలో చాలా ముఖ్యమైన కవిత 'దేశ చరిత్రలు'. మానవజాతి పుట్టినప్పటి నుండి వివిధ దేశాల చరిత్రలను సమీక్షించాడు శ్రీశ్రీ ఆ కవితలో. మార్క్సు తన సిద్ధాంతంలో చేసిన పొరపాట్లు ఈ కవితలో మనకు స్పష్టంగా కన్పిస్తాయ్.

ముఖ్యంగా

*చీనాలో రిక్షావాలా*
*చెక్‌దేశపు గని పనిమనిషీ*
*ఐర్లండున ఓడ కళాసీ*
*అణగారిన ఆర్తులందరూ*

అనే భావంలో నిజం లేదు.

రిక్షాలో వెళ్ళేవాడి కంటె రిక్షా తొక్కేవాడు ఎక్కువ బాధపతున్నాడనడం ఊహ మాత్రమే.

*చిరకాలం జరిగిన మోసం*
*బలవంతుల దౌర్జన్యాలు*

ధనవంతుల పన్నాగాలు
ఇంకానా - ఇకపై చెల్లవు

బలవంతులు దుర్బల జాతిని
బానిసలను కావించారు

ఏ దేశ చరిత్ర చూసినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం

ఏ విధంగా చూసినా నరజాతి చరిత్ర పరపీడన పరాయణత్వం అనడం ఒక్కటే పరమ సత్యం. దుర్బల జాతు లెపుడూ బానిసలుగానే బ్రతుకు తుంటారు. మన దేశంలో కట్టు బానిసత్వం అదే కదా ! ఇది ఇకపై సాగదు అంటే ఎందుకు సాగదు ? ఎలా సాగదు ? జవాబు లేని ప్రశ్న ఇది.

కార్మికుడు పోరాడి, యజమానిని బానిసను చేస్తే, మళ్ళీ యజమాని పోరాటానికి దిగడా ? ఈ వర్గ పోరాటానికి అంతం అనేది ఉండదు. ఇదే ప్రపంచానికి మార్క్సు పెట్టిన భిక్ష.

పని విభజన, వృత్తి వర్గాల మధ్య స్పర్థలు ఎప్పుడూ ఉండేవే. వాటికి ప్రత్యేక శాస్త్రీయత కల్పించి ఒక వర్గం పక్షాన పోరాటానికి దిగడం మార్క్సు చేసిన పొరపాటు.

తాజ్‌మహల్ నిర్మాణంలో
రాళ్ళెత్తిన కూలీ లెవ్వరు ?

ఎంతమంది కూలీలను లెక్క పెట్టగలం ? వాళ్ళ వల్ల తాజ్‌మహల్ నిర్మాణం జరిగిందని కూడా చెప్పగలమా ?

ఈ రచనకు..... మహాభారత నిర్మాణంలో

తాటాకులు కుట్టిన కార్మికు లెవ్వరు ? తుద కెవ్వరు ?

అనే పారడీలు కూడా పుట్టాయి. మహాభారత రచనలో తాళ పత్రాలు సమకూర్చిన వారికి ప్రమేయం ఉందా ? నన్నయ్య భట్టు కంటె తాటాకులు కొట్టిన

వాడే గొప్పవాడా ? తాటాకులు కొట్టిన వాడే గొప్పవాడు అని అంటుంది మార్క్సిజం. నిజం కాదు అనేది మన అందరికి తెలుసు.

మార్క్సిజం పట్టి మిథ్యవాదం మాత్రమే. ఇది పసిడి తీగల పంజరం అని తెలిసీ, కలత నిదుర కలలతో అందులో చేరి, అవి గాలి మేడల్లా కూలిపోగా ఇక ఏమని పాడగలను అంటూ చింతించాడు శ్రీశ్రీ. అట్టి మహా విపత్తు నుంచి ఆయనను రక్షించినట్టిది మధ్య మధ్య సినిమా అవకాశాలు. ఆయన తెగించి వ్రాసిన రస గేయాలు.

## రంగాయిజం

మార్క్సిజం సిద్ధాంతంగా కమ్యూనిజం ఆంధ్రలో విస్తృతంగా ప్రచారం అవుతూన్న కాలంలోనే కాంగ్రెసు సంస్థలో ఒక ఉత్తమ నాయకుడుగా గోగినేని రంగనాయకులు ప్రచారంలోకి వచ్చారు.

ఆయననే ఎన్. జి. రంగా అని పత్రికలు, ప్రజలు పేర్కొంటూ వచ్చారు. రంగా అనే పేరుకు అట్టి ప్రచారం రావడానికి తానే కారణమంటూ ఆంధ్రప్రభ ఎడిటర్ నార్ల వేంకటేశ్వరరావు చెప్పుకున్నారు కూడా.

రంగా ఉన్నత విద్యావంతుడు. యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య రంగాగా ప్రసిద్ధుడైన వాడు. పుట్టింది గుంటూరు జిల్లాలో. కాంగ్రెసులో అగ్రశ్రేణిలో వాడు. నిత్య నిస్వార్థ సత్యాన్వేషి. ఆయన అన్వేషించి ప్రచారంలోకి తెచ్చిన సత్యాన్నే 'రంగాయిజం'గా యిక్కడ పేర్కొంటున్నాను.

మార్క్సిజంలో వైజ్ఞానిక సార్వత్రికత లేదన్న సంగతి రంగా గుర్తించాడు. ప్రపంచ కార్మికులందరూ ఏకం కాగలరని, ప్రపంచమంతా కార్మిక నియంతృత్వం ఏర్పడగలదని మార్క్సు భ్రమపడి వుండవచ్చు.

కాని సనాతన హిందూ దేశానికి, కుల ప్రధానమైన హైందవ సాంఘిక వ్యవస్థకు మార్క్సిజం పనికి రాదన్న వాస్తవం ఆనాడే అందరూ గుర్తించ గలిగారు. కార్మికు లందరూ ఒకే రకం పని చేస్తూ వుండవచ్చు. అయితే వాళ్ళందరూ ఒకే కులం వాళ్ళు కాదు.

కులాలు మొదట్లో వృత్తి వర్గాలే అయినా, వృత్తి నిబంధనల కంటే సాంఘిక నిబంధనలే వాటికి ప్రాతిపదిక లైనాయి. కనుక ఏ కులం కార్మికులది ఆ కుల వర్గం. కులాలకే తప్ప వృత్తులకు ప్రాధాన్యం లేదు.

ఇది గుర్తించిన రంగా రైతుకూలీ ప్రజారాజ్యం అనే సిద్ధాంతాన్ని లేవ నెత్తాడు. రైతులు కూలీలు ప్రజలు అందరూ ఒకే జాతివాళ్ళు ఒకే కుటుంబంగా పనులు చేసుకొంటున్నవాళ్లు.

కుర్రవాళ్ళు పొలం పనులు చేస్తుంటే, పెద్దవాళ్ళు పెత్తనాలు చలాయిస్తుంటే, వృద్ధులు పురమాయింపులు చేస్తున్నారు.

కుర్రవాళ్ళు కూలీలు. పెద్దవాళ్ళు. పాలేళ్ళు. మోతుబర్లు. ఉద్ధారకులు. శారీరకంగా పనులు చేయకపోయినా మంచి అనుభవశాలురైన వృద్ధులు పురమాయింపులు చేయడం జరుగుతున్నది. మొత్తం అందరూ ఒకే కుటుంబం. వర్గాలు లేవు.

మార్క్సు కుటుంబాన్ని వర్గాలుగా విడదీస్తే, రంగా వృత్తి వర్గాలను కుటుంబంగా సమకూర్చాడు. రైతులు, కూలీలు, వాళ్ళకు సంబంధించిన ఇతర వృత్తుల వాళ్ళు, ప్రజలు – వీళ్ళు ముగ్గురూ మూడు వర్గాలు. ఈ వర్గాల ప్రజలకు సలహాదారులైన వృద్ధులు. ఇది నాలుగో వర్గం. ఈ నాలుగు వర్గాలు కలిసి ఒకే కుటుంబం. వీళ్ళు చేతనయిన పనులు చేస్తారు. అవసరాన్ని బట్టి సంపదను అనుభవిస్తారు.

ఇది సోషలిజం. మార్క్సిజం కంటే ఉత్తమమైన వ్యవస్థ. భారతీయ సంప్రదాయ అనుగుణమైన వ్యవస్థ. సర్వ జనామోదకరమైన వ్యవస్థ. అందరినీ కలిపి వుంచే, కలుపుకు పోయే ముందుకు సాగే వ్యవస్థ.

అందుకే భారతీయ వాతావరణంలో మార్క్సిజం సహజంగానే విఫల మయ్యింది.

రంగా తమవాడు, స్థానికుడు, సమకాలీనుడు కావడంవల్ల అతడికి అవసరమైన ప్రాధాన్యం కరువైంది.

**'ఏ గతి రచియింతు రేని**

**సమ కాలము వారలు మెచ్చరే కదా ?"** అన్నాడు చేమకూర.

నిజానికి మానవ సమాజంలో ఎవడికి వాడే పరమాత్మ. ఎవరి గొప్ప వారిదే. ప్రతివాడు తను గొప్పవా డనుకొంటాడు. మరొకడు ఎంత గొప్ప విషయం చెప్పినా పట్టించుకోడు. సామాన్య విషయంగా తీసి పారేస్తాడు.

కాంగ్రెసు వంటి ప్రముఖ సంస్థలో అగ్ర నాయకుడిగా వుంటూ కూడా, ప్రజాపార్టీ వంటి ప్రత్యేక సంస్థలను నెలకొల్పి కూడా, దీర్ఘకాలం పార్ల మెంటేరియన్‌గా రికార్డు సృష్టించి కూడా, స్వతంత్ర పార్టీని విడదీసి చూపి కూడా రంగా తన సిద్ధాంతాన్ని ప్రజా హృద్గతం చెయ్యలేకపోయాడు.

అయినా వర్గాలు, వర్గ పోరాటాలు లేని కుటుంబం సాంఘిక వ్యవస్థగా రంగాయిజం పుట్టింది, పెరిగింది, వికసిస్తున్నది. కమ్యూనిజం ఒక సిద్ధాంతమే కాదని, ప్రజా శ్రేయస్సుకు పనికి రాదని నిరూపించి నిలవగలిగింది.

ముఖ్యంగా భారతదేశం వ్యవసాయ దేశం కాబట్టి, వ్యవసాయాన్ని కేంద్రంగా తీసుకునే రైతు కూలీ ప్రజారాజ్యం పుట్టి పెరిగింది కాబట్టి దీన్ని ఒక ఉద్యమంగా ముందుకు తీసుకు పోవలసిన వాళ్ళు సంఘటితులైన రైతులు, కూలీలు.

కులాల వారీగా చెప్పాలంటే కాపు, కమ్మ, రెడ్డి, వెలమ వంటి వ్యవసాయ కులాలు, హరిజనులు వంటి కార్మిక కులాలు కలిసి రంగాయిజాన్ని లోక విస్తృతం చెయ్యవలసి వుంది.

## జాతీయ సోషలిజం

సంప్రదాయం, మార్క్సిజం, రంగాయిజం, సామాజిక అనుబంధాలు మొదలైన వన్నీ కలిసి ప్రపంచంలోని ప్రతి దేశంలోనూ ప్రవర్తింపచెయ్యడాన్ని జాతీయ సోషలిజం అంటున్నాను నేను.

ఈ జాతీయ సోషలిజం నేను చేసిన ఇటీవలి ప్రతి రచనలోను వివరించి ఉన్నాను.

సంస్కృతి ఆధారంగా ప్రతి మానవ సమాజానికి ఒక స్వతంత్రదేశం ఉండాలి. అది ఎంత చిన్నదయినా కావచ్చు. పెద్దది అయినా కావచ్చు.

ఏదైనా సంప్రదాయం గల, సంస్కృతి గల జాతి బాగా చిన్నదై ఆర్థికంగా నిలబడ లేనంత బలహీనమై ఉన్నపుడు, దానిని ఒక దేశంగా గుర్తించడం ఎలా అని ఆలోచించకూడదు. ఎంత చిన్న జాతి అయినా సంస్కృతిలో మరొక జాతికి సంబంధం లేని దైనపుడు కొంత భూభాగం కేటాయించి దాని కొక దేశాన్ని ఏర్పాటు చేయవలసిందే.

ఈ విధంగా ప్రపంచమంతా చిన్న పెద్ద దేశాల వంతుగా గుర్తించ బడవలసి వుంది. ఈ దేశాలన్నిటికీ ఒకే ఒక విధానం ప్రవర్తిల్లాలి. అది సోషలిస్టు విధానంగా ఉండాలి.

సోషలిజం అంటే అందరికీ తెలిసిందే. ఆర్థిక సమానత్వం, కనీస ఆదాయం, వృత్తుల సదుపాయం, అందరికీ ఒకే రకమైన చట్టం, న్యాయం, విద్య, ఆరోగ్యం, మిలటరీ శిక్షణ, ఉమ్మడి వసతి మొదలైన కనీస అవసరాలు ప్రతి వ్యక్తికి కల్పించడం. ఇలాటి ఒక సమగ్రమైన సర్వ శ్రేయస్కరమైన సాంఘిక వ్యవస్థనే సోషలిజం అంటాం.

ప్రపంచంలోని ప్రతిదేశమూ దాని సాంస్కృతిక పరిధిలో సోషలిస్టు దేశమే. అందుకే దానిని 'జాతీయ సోషలిజం' అన్నాను.

సోషలిస్టు ప్రధాన సూత్రాలు అన్నీ సమానమే అయినా, సంస్కృతీ సంప్రదాయాల దృష్ట్యా రెండు దేశాల మధ్యతేడా లుంటాయి. దేని పరిధి దానిది. దేని అభివృద్ధి క్షేత్రం దానిది. అందుకే అది 'జాతీయ సోషలిజం'.

ప్రతి సమాజం సోషలిస్టు సమాజమే. ప్రతి దేశమూ సోషలిస్టు దేశమే. ఈ దేశాలన్నీ చేరిన సమాజమే ప్రపంచ సోషలిస్టు ప్రభుత్వం.

# ఇంతకూ శ్రీశ్రీ

- తెలుగులో, ఆధునిక కవులలో అగ్రగణ్యుడు మహాకవి శ్రీశ్రీ.
- అనవసరంగా శ్రీశ్రీ కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. కాని ఆయన మనస్తత్వం కమ్యూనిస్టు మనస్తత్వం కాదు. నూటికి నూరు పాళ్ళు భారతీయ మనస్తత్వం.
- ఆయన మనసు వీణ. అది రాధ. ఆయన వేణుగానలోలుడు. వేణువు పురుష వాద్యమైనా వీణ కంటే తక్కువది.
- కమ్యూనిస్టు పార్టీని పంజరం అన్నాడు. తాను చిలుక.
- యువకుల్ని భ్రాంతిలో ముంచి, తాను భ్రాంతిలో బ్రతుకుతూ, మధ్య మధ్య పత్రికల ద్వారా స్వేచ్ఛను పొంది, తాను ఇష్టానుసారం మెలిగిన వాడు.
- అందుకు ఆయన రచన లన్నీ సాక్ష్యాలే.

ఈ గ్రంథానికి ఇంట్రడక్షన్ చెప్పరా అని పిళ్ళా రామకృష్ణ అడిగినపుడు, శ్రీశ్రీ జీవితానికి ఈ గ్రంథమే ఒక ఇంట్రడక్షన్ అన్నాను. నిజానికి అదే యధార్థం.

పిళ్ళా రామకృష్ణ అంటే రవిచంద్ర మిత్రుడు. నాకు నా డిక్టేషన్ తీసుకోవడంలోనూ, ప్రూఫ్‌లు దిద్దడంలోనూ, మొత్తం మీద నా గ్రంథముద్రణ కార్యక్రమంలో నా కెంతో సహాయపడుతున్నవాడు.

శ్రీశ్రీ కమ్యూనిస్టు అనే భావం, అనే ప్రచారం దేశంలో చాలా ఉంది. అందులో మాత్రం నిజంలేదు. నిష్ఠూరమైన ఈ నిజాన్ని వక్కాణించి చెపుతున్నా నిపుడు. ఈ విషయాన్ని పూర్తిగా పరిశోధించి ముగించాలంటే శ్రీశ్రీ సృష్టించిన సాహిత్యాన్ని ప్రతి మాటను పరిశీలించవలసిందే.

పరిశీలించి, పరిశోధించి, సమగ్రమైన ఒక గ్రంథాన్ని వ్రాయవలసి వుంది. దానికి ఈ నా చిన్న గ్రంథం ఒక చిన్న పీఠికగా పనికి రాగలదు.

## BHIMANNA'S LITERARY LIFE

### A BRIEF PROFILE

Dr. Boyi Bhimanna has to his credit hundreds of literary works in different forms like Poems, Lyrics, Plays, Ballets, Criticism, Satire, Treatise, Free verse, Poetic Prose, Letteritts etc. all being creative and recreative on all subjects - mythological and social duly authenticated.

Bhimanna is the originator of theories like 1. Rasaadvyta, 2. Tiger Jackal - Sheep Psyche of the humans 3. Harijans are Aryans 4. Siva Socialism 5. Salvation (Moksha) is the birthright of every being etc. All his literary creation blooms around such theories that are evolved by him.

His literary creation comprises mostly of love, beauty and cosmic communion, with a social consciousness of the Vedic Casteless order. He revived and revitalized the Vedic Casteless tradition for exhorting the modern Hindu India to get reformed and rehabilitated.

Bhimanna says that there is no God with a frame and name. He visualizes Paramaatma as a Universal Energy which can be shaped by the individual human mind into any form of its liking.

Many of his published works have been, prior to getting them in book form, serialized in different journals, sung in Akashvani and Doordarshan, and were staged widely. Some of them are being prescribed for Collegiate studies and Doctorate Researches.

He thinks and creates in such an original and revolutionary way that he is considered in the literary world, a rebel.

Till now, he published more than 70 works out of hundreds of manuscripts waiting to be published. At the age of 93 also, he was still creating with zeal and enthusiasm that is unsurpassed.

## BIO-DATA

| | |
|---|---|
| 1911 | Born in a poor Harijan Family on 09-09-1911, at Mamidikuduru, East Godavari District, Andhra Pradesh |
| 1922 | Sang his first poem. |
| 1935 | Graduated from P.R. College, Kakinada. |
| 1936 | Sub-Editor, Jana Vani, a Telugu Daily. |
| 1937 | Edited Kusuma Dharmanna's Jaya Bheri, a Telugu Fortnightly, Rajahmundry (while studying B.Ed) |
| 1938 | Sub-Editor, Praja Mithra, a Telugu Weekly, Madras. |
| 1939 | Edited B.S. Murthi's Nava Jeevana, a Telugu Monthly, Madras. |
| 1940-45 | 1. Worked as Teacher, East Godavari District.<br>2. Member, Senate, Andhra University, Visakhapatnam.<br>3. Activist, Quit India Movement. |
| 1946 | 1. Provincial Congress Organiser (Harijan Wing).<br>2. Joint Secretary, State Harijan Sevak Sangh, Madras.<br>3. Edited Vyavasaaya Kooli of Vemula Kurmaiah, the then Minister, Madras. |
| 1950-55 | 1. Sub-Editor, Andhra Prabha, a Telugu Daily Madras.<br>2. Contested to the State Legislative Assembly as Congress Candidate from Razole Double Member Constituency, 1952.<br>3. Honoured by the People with a Gold Anklet (Ganda Penderam) at Cherukupally, Guntur under the presidentship of Sri D. Sanjeevaiah, the then Minister, Madras in 1953. |
| 1955 | Appointed as Director, Department of Translation and as Registrar of Books, Government of Andhra Pradesh. |
| 1959 | Organised the First All India Telugu Writers Conference as President of Navya Saahiti Samithi. |
| 1960 | Continued as a Member, Executive Committee and Fellow of State Sahitya Academy. |
| 1968 | Public felicitation at Kakinada with a title of Maha Kavi. |
| 1971 | Award of Honourary Doctorate of Kalaa Prapoorna by the Andhra University. |
| 1973 | Award of Padma Sri by the President of India. |
| 1975 | National Award by the Central Sahitya Academy for the Poetry Volume Gudiselu Kaalipothunnai (The Huts are on Fire). |

1975 1. Honoured by the First Telugu Conference for outstanding contribution to Telugu Literature.

2. Represented Telugu Language in the Republic Day Poets Symposium, New Delhi.

1975-76 Member, A.P. Film Awards Committee (for two terms).

1976 Award of Honourary Doctorate of D. Litt by the Kasi Vidya Peeth, Varanasi.

1978 1. Nominated by the Governor of Andhra Pradesh to the A.P. Legislative Council (1978-84).

2. Nominated by the Govt. of A.P. to the Governing Board of International Telugu Institute.

1983 Member, Syndicate, Sri Krishna Deva Raya University, Ananthapur.

1985 Chairman, Reception Committee, All India Dalit Writers Conference.

1988 Kanakaabhishekam (Felicitation with Gold Flowers) at Vijayawada.

1989 Pushpaabhishekam at Hyderabad.

1990 Kanaka Pushpaabhishekam at Visakhapatnam.

1991 1. Tikkavarapu Rami Reddy Centenary Award by Dr. Bejawada Gopala Reddy at Nellore.

2. Felicitation by Dalit Open University of India, Guntur.

3. Raja Lakshmi Literary Award.

1991-92 Member, State Committee, Ambedkar Centenary Celebrations.

1992 Telugu University Prathama Visishta Puraskaaram

1993 Honourary Doctorate by Nagarjuna University, Guntur.

1995 Member, Programme Committee, South Central Zone Cultural Centre, Nagpur.

1996 Telugu Aatma Gourava Puraskaaram by the Govt. of A.P.

1997 1. Member, State Committee on Golden Jubilee Celebrations of Indian Independence.

2. Member, State Cultural Council, Govt. of A.P.

2000 Nava Yuga Kavi Sarvabhouma Title conferred by Vijaya Bhavana, Vizianagaram on Ugaadi Day Celebrations.

2001 Padma Bhooshan by the President of India.

2002 Hamsa Award by AP Govt.

2002 Mahatma Gandhi Harmony Award by Jay Bharath.

2003 Jashuva Puraskar by Jashuva Foundation.

COMPLETE WORKS OF BOYI BHIMANNA VOL - 4 : VACHANA GRANDHALU PART - II

## డా॥ బోయి భీమన్న సమగ్ర సాహిత్య సంపుటాలు

1. సంపుటి - 1 - భీమన్న గేయ కావ్యాలు : భాగం 1 & 2
2. సంపుటి - 2 - భీమన్న పద్య కావ్యాలు : భాగం 1 & 2
3. సంపుటి - 3 - భీమన్న వచన కవితా సంపుటాలు : భాగం 1, 2 & 3
4. సంపుటి - 4 - భీమన్న వచన గ్రంథాలు : భాగం 1 & 2
5. సంపుటి - 5 - భీమన్న నాటకాలు : భాగం 1 & 2
6. సంపుటి - 6 - Works of Boyi Bhimanna
7. సంపుటి - 7 - భీమన్న అముద్రిత రచనలు
8. సంపుటి - 8 - భీమన్న పీఠికలు : భాగం 1 & 2

## ఇతర రచనలు

1. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న - శ్రీమతి హైమవతీ భీమన్న
2. భీమన్న సాహితీ షష్టి పూర్తి సంచిక - సంపాదకుడు : శ్రీ గనుమల జ్ఞానేశ్వర్
3. బోయి భీమన్న రచనలు - దళిత దృక్పథం - (సదస్సు పత్రాలు)
4. బోయి భీమన్న నాటకాలు - సార్వజనీనత - (సదస్సు పత్రాలు)
5. బోయి భీమన్న సాహిత్యం - వర్తమాన సమాజానికి సందేశం (సదస్సు పత్రాలు)
6. బోయి భీమన్న రచనలు - కావ్యతత్వ వివేచన (సదస్సు పత్రాలు)